RNI No.TELTEL/2016/68720
ప్రజలకోసం పోలీస్
# పోలీస్ నిఘా
POLICE NIGAH
తెలుగు దినపత్రిక
Published from Rangareddy, (Circulated) by Hyderabad, Rangareddy, Nalgonda, Mahabubnagar, Sangareddy, Vikarabad, Medak, Siddipet, Karimnagar, Sirisilla(Vemulawada), Nizamabad, Warangal, Yadadri Bhonagiri, Nirmal, Adilabad
రంగారెడ్డి | సంపుటి : 10 | సంచిక : 173 | ఎడిటర్: కేమోజు శ్రీనివాస్ | శుక్రవారం 27-03-2026 | వెల: రూ.5/- | పేజీలు: 8

పోలీస్ నిఘా POLICE NIGAH
పోలీస్ నిఘా POLICE NIGAH NEWS TV
రెండు తెలుగు రాష్ట్రాల్లో రిపోర్టర్స్ కావలెను
Contact : 9133613813






# ఏపీలో ఘోర ప్రమాదం

## మార్కాపురం జిల్లాలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం

## టిప్పర్‌ను ఢీకొట్టిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

## 13 మంది సజీవ దహనం ◆ 28 మందికి గాయాలు

మార్కాపురం, మార్చి 26 (పోలీస్ నిఘా) : ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సుతోపాటు టిప్పర్‌లోనూ మంటలు చెలరేగాయి. ప్రమాదంలో బస్సులోని 13మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. వారి మృతదేహాలను వెలికితీశారు. మరో 28 మందికి గాయాలయ్యాయి. బస్సును హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందినదిగా గుర్తించారు. గురువారం తెల్లవారు జామున 6 గంటల సమయంలో ఈ ఘోరం జరిగింది. ఘటనా స్థలికి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మార్కాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. బస్సు తెలంగాణలోని జగిత్యాల నుంచి నెల్లూరు జిల్లా కనిగిరికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటన జరిగిన సమయంలో బస్సులో 41 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

మిగతా 2లో

# విద్య, పేదల వైద్యం మాకు అత్యంత ప్రాధాన్యాంశాలు

## ఆరోగ్యశ్రీ బకాయిలు గత ప్రభుత్వ పుణ్యమే

## అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

హైదరాబాద్, మార్చి 26 (పోలీస్ నిఘా) : రాజీవ్ ఆరోగ్యశ్రీ బకాయిల వల్ల ప్రైవేటు హాస్పిటల్స్ మూతపడుతున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఆయన గురువారం మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన ఆరోగ్యశ్రీ బకాయిలు మోస్తూనే రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు. 2023 డిసెంబర్ 7 నాటికి రూ.627 కోట్లు పెండింగ్ బకాయిలుగా తమకు భారం అయిందన్నారు. అప్పటినుంచి ఈ రోజు వరకు రూ.2408 కోట్లను ఆరోగ్యశ్రీ కోసం చెల్లించామని, ఇందులో ప్రభుత్వ హాస్పిటల్స్‌కు రూ.927 కోట్లు, ప్రైవేటు హాస్పిటల్స్‌కు రూ.1480 కోట్లు చెల్లించామని, ఈ రోజు వరకు ఉన్న బకాయిలు రూ.727 కోట్లు మాత్రమేనని వివరించారు. ఎప్పటికప్పుడు చెల్లింపులు జరుగుతున్నాయని, గత ప్రభుత్వం ఇచ్చిన బకాయిలే పెండింగ్‌లో ఉంటున్నాయని చెప్పారు. ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించుకునే రోగుల సంఖ్య పెరిగిందన్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్‌కు బకాయిలు చాలా తక్కువగా ఉన్నాయంటూ ఆరోగ్యశ్రీ చెల్లింపులపై అపోహలు కల్పిస్తున్నారని విమర్శించారు. కాగా, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల విషయంలో గతంలో అనేక అవకతవకలు జరిగాయని, కొంతమంది ఈ నిధిని దుర్వినియోగం చేశారని, కేసులు కూడా పెట్టారని, తమ ప్రభుత్వం వచ్చాక ఆన్‌లైన్‌లో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. దీని వల్ల అక్రమాలకు అవకాశం లేకుండా పోయిందని, ఇప్పటివరకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2046 కోట్లు



ఇచ్చామని, ఆరోగ్యశ్రీ కోసం రూ.2400 కోట్ల ఖర్చు చేశామని, పేదల వైద్యం కోసం రూ.4500 కోట్లను తమ ప్రభుత్వం ఇచ్చిందని వివరించారు. రాష్ట్రంలో 35 మెడికల్ కాలేజీలు ఉండగా టీచింగ్ కాలేజీలకు రోగులు రావడం లేదని తెలిపారు. పేదలు వైద్యం కోసం వెళ్లే దగ్గర సరైన డాక్టర్లు లేరు.. అందువల్ల ఆరోగ్యశ్రీ రోగులను టీచింగ్ కాలేజీలకు పంపించే ఆలోచన చేస్తున్నామని ఆయన చెప్పారు. ఆరోగ్యశ్రీతోపాటు సీఎం రిలీఫ్ ఫండ్‌ను వీటికి ఇస్తామని, దీనివల్ల ఈ హాస్పిటల్స్ నిర్వహణ మెరుగుపడుతుందని, వీటి నిర్వహణను గ్రూప్-1 అధికారికి ఇవ్వాలని అనుకుంటున్నామని చెప్పారు. కులగణనలో భాగంగా చేసిన జనగణన ఆధారంగా కోటీ 15 లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ జీవిత బీమా ఇవ్వబోతున్నామని, దీని వల్ల ప్రతి కుటుంబానికి ధీమా కల్పించబోతున్నామని తెలిపారు. మన వాళ్లు వేల మంది డాక్టర్లు విదేశాల్లో పనిచేస్తున్నారని, వారి కోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్ తయారు చేస్తున్నామని, మన ప్రాంతానికి వాళ్లు వచ్చినప్పుడు ఇక్కడ హాస్పిటల్స్‌లో సేవలు అందించడానికి వెబ్‌సైట్ ద్వారా ఏర్పాట్లు చేస్తున్నామని, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఈ వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. వరంగల్, అల్వాల్, ఎల్‌బీ నగర్, సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్స్‌ను స్పెషలైజేషన్ హాస్పిటల్స్‌గా మారుస్తున్నామని, ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఇచ్చే నిధులను వీటికి కేటాయిస్తామని సీఎం చెప్పారు. గోషామహల్‌లో 30 ఎకరాల్లో రూ.3000 కోట్లతో ఉస్మానియా కొత్త హాస్పిటల్ నిర్మిస్తున్నామని, అదనంగా 10 వేల పడకలు అందుబాటులోకి తీసుకొస్తున్నామని, టిమ్స్ పనులు వేగంగా చేస్తున్నామని, గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటూ వస్తున్నామని చెప్పారు. దామోదర్ రాజనర్సింహ ఇంజనీర్ అయినప్పటికీ సోషల్ డాక్టర్.. ఆయనకు పేదల కష్టాలపై సంపూర్ణమైన అవగాహన ఉంది.. వైద్యంలో నిరంతరం కొత్త సవాళ్లు ఎదురవుతాయి.. వైద్య ఆరోగ్య శాఖ ఒక సవాల్ లాంటిది. భవిష్యత్తులో అనేక సంస్కరణలు తీసుకురాబోతున్నాం.. సభ్యులు ఇచ్చే సలహాలను స్వీకరిస్తామని అన్నారు. విద్య, వైద్యం తమ ప్రభుత్వ ప్రాధాన్యతలు.. విద్య అందుబాటులో ఉన్నా నాణ్యమైన విద్య లేదు.. పేదల విద్య, వైద్యం విషయంలో ఒక్క రూపాయి కూడా కోత విధించం.. అవసరమైతే మరిన్ని నిధులు ఇస్తాం అని ముఖ్యమంత్రి రేవంత్ స్పష్టం చేశారు.

# వర్షాకాలం సన్నద్ధతపై.. పోలీస్ - జీహెచ్ఎంసీ సమన్వయ సమావేశం

## నగర ప్రజలకు అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు




హైదరాబాద్, మార్చి 26 (పోలీస్ నిఘా) : రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగర ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు పోలీస్, జీహెచ్ఎంసీ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించాయి. బషీర్‌బాగ్‌లోని పాత పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో గురువారం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ వీసీ సజ్జనర్ ఐపీఎస్ గారు, జీహెచ్ఎంసీ కమిషనర్ శ్రీ ఆర్‌వీ కర్ణన్ ఐఏఎస్ గారుల ఆధ్వర్యంలో కన్వర్జెన్స్ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించిన అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. వర్షాలు మొదలైన తర్వాత కాకుండా, ఇప్పటి నుంచే యుద్ధప్రాతిపదికన డ్రైనేజీ పూడికతీత, పైప్‌లైన్ల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. నగరంలో ప్రధానంగా గుర్తించిన టాప్ 10 వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద తక్షణమే పనులు ప్రారంభించి శాశ్వత పరిష్కారం చూపాలని, అలాగే ప్రజల ప్రాణాలకు ముప్పు కలగకుండా తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్‌కు పటిష్టమైన మూతలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలో పాదచారుల సౌకర్యార్థం ఫుట్ పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించడానికి ఒక సరైన ప్రణాళికను రూపొందించి, అమలు చేయాల్సిన అవసరముందన్నారు. రాత్రి వేళల్లో ప్రజా భద్రత కోసం స్ట్రీట్ లైట్లు సరిగ్గా పనిచేసేలా చూస్తూ, అవసరమైన చోట కొత్త లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రహదారుల్లోని ఇంజనీరింగ్ లోపాలను సరిదిద్దాలని, నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం జీహెచ్ఎంసీ కమిషనర్ శ్రీ ఆర్‌వీ కర్ణన్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో ప్రజలకు ఆస్తి, ప్రాణ నష్టం కలగకుండా చూడటమే అధికారుల ప్రాథమిక బాధ్యత అని గుర్తుచేశారు. పోలీసు విభాగంతో కలిసి పనిచేస్తూ నగర మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరుస్తామని, నగర సుందరీకరణతో పాటు రహదారుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, రహదారుల అభివృద్ధికి సంబంధించి ప్రత్యేకంగా

మిగతా 2లో

# నేడు మద్యం షాపులు బంద్

## ఉత్తర్వులు జారీ చేసిన సీపీ సుధీర్ బాబు



రంగారెడ్డి, మార్చి 26 (పోలీస్ నిఘా) : శ్రీరామ నవమి పండుగ సందర్భంగా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మద్యం దుకాణాలను మూసివేయాలని పోలీస్ కమిషనర్ శ్రీ జి. సుధీర్ బాబు గారు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు, 27 మార్చి 2026 (శుక్రవారం) ఉదయం 10:00 గంటల నుండి రాత్రి 10:00 గంటల వరకు కమిషనరేట్ పరిధిలోని అన్ని వైన్ షాపులు, కల్లు దుకాణాలు (టాడీ షాప్స్), బార్లు మరియు రెస్టారెంట్లలోని బార్లు మూసివేయాలని ఆదేశాలు జారీ చేయబడ్డాయి. అయితే స్టార్ హోటళ్లు మరియు రిజిస్టర్డ్ క్లబ్‌లకు ఈ నిబంధన నుండి మినహాయింపు కల్పించబడింది. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# ఏప్రిల్ 2 నుంచి ఇంటిగ్రేటెడ్ భూభారతి ప్రయోగాత్మక అమలు: పొంగులేటి




హైదరాబాద్, మార్చి 26 (పోలీస్ నిఘా) : ఏప్రిల్ 2 నుంచి ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్‌ను 5 మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయబోతున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. నారాయణపేట జిల్లా కోస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. సచివాలయంలో రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్‌తోపాటు ఎన్ఐసీ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ధరణి పోర్టల్‌లోని చిక్కుముడులను విప్పేందుకు ప్రభుత్వం భూభారతి పోర్టల్‌ను రూపొందించిందన్నారు. రెవెన్యూ, సర్వే, స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకి తీసుకొచ్చేందుకు ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ తీసుకొస్తున్నట్లు తెలిపారు. దీనిని భూ లావాదేవీల వివరాలు పూర్తిగా కనిపించే పారదర్శక వ్యవస్థగా పేర్కొన్నారు. ప్రతి సర్వే నెంబర్‌కు ఆధార్ తరహాలో ‘ భూదార్ నెంబర్’ కేటాయించనున్నట్లు వివరించారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ జతచేయడం ఈ మండలాల్లో అమలు చేయబోతున్నట్లు చెప్పారు. పైలట్ ప్రాజెక్టు అనంతరం ఇంటిగ్రేటెడ్ భూభారతిని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రైతులకు సులభతర సేవలు, భూ వివాదాల పరిష్కారం దిశగా ఇది కీలక అడుగుగా ప్రభుత్వం చెబుతోంది.

# పెను విషాదం

## పద్మా నదిలో మునిగిన బస్సు 23కు చేరిన మృతుల సంఖ్య

ఢాకా, మార్చి 26 : ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి పద్మా నది లో పడిపోయిన బస్సు ప్రమాదంలో మృతుల సంఖ్య భారీగా పెరుగుతోంది. బంగ్లాదేశ్‌లోని రాజ్‌బరి జిల్లా దౌలత్‌డియా ఫెర్రీ టెర్మినల్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన ఘోర ప్రమాదం పెను విషాదాన్ని నింపింది. రాజ్‌బరి నుండి ఢాకా వెళ్తున్న ఒక ప్రయాణికులతో కూడిన బస్సు, ఫెర్రీ ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు పద్మా నదిలో పడిపోయింది. తాజా సమాచారం ప్రకారం, ఈ ఘటనలో మరణించిన వారి సంఖ్య 23 కు చేరుకుంది. మృతుల్లో ఎక్కువ మంది మహిళలు, చిన్నారులు ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. సుమారు 50 మంది ప్రయాణికులతో ఉన్న ఈ బస్సు, ఫెర్రీ ప్లాట్‌ఫారమ్ (పాంటూన్) మీద నిలబడి ఉన్న సమయంలో ‘హస్నా హెనా’ అనే చిన్న పడవ వేగంగా వచ్చి ప్లాట్‌ఫారమ్‌ను ఢీకొట్టింది. ఆ తీవ్రమైన కుదుపునకు డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం తో బస్సు నేరుగా 80 అడుగుల లోతున్న నదిలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన ఫైర్ సర్వీస్, నౌకాదళం, స్థానిక పోలీసులు భారీ ఎత్తున సహాయక చర్యలు చేపట్టారు. ‘హంజా’ అనే రెస్క్యూ షిప్ సహాయంతో సుమారు ఆరు గంటల శ్రమ



అనంతరం నదిలో మునిగిపోయిన బస్సును బయటకు తీశారు. బస్సు లోపల చిక్కుకుపోయిన వారి మృతదేహాలను వెలికితీస్తుండటంతో తీరం వెంబడి ఉన్న బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి. ఈద్ సెలవుల అనంతరం తమ కుటుంబాలతో కలిసి తిరిగి పనుల్లోకి వెళ్తున్న వారే ఈ ప్రమాదంలో ఎక్కువగా ప్రాణాలు కోల్పోయారు. సుమారు 11 మంది ప్రయాణికులు అతికష్టంమీద ఈదుకుంటూ ప్రాణాలతో బయటపడగా, మరికొంతమంది ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి తారిఖ్ రెహమాన్ తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, విచారణకు ఆదేశించారు. కాగా ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలుపుతున్నారు.

# అన్ని రాష్ట్రాల సీఎంలతో నేడు మోదీ సమావేశం



న్యూఢిల్లీ, మార్చి 26 : పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమయ్యింది. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ మార్చి 27న వర్చువల్‌గా సమావేశం కానున్నారు. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడనున్న ఆయన.. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్ అనుసరిస్తున్న విధానాలను వివరించనున్నట్లు సమాచారం. అదేవిధంగా ఆయా రాష్ట్రాల సన్నద్ధత, సహకారంపై చర్చించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.





# శ్రీ సీతారామ దివ్య చరిత్ర

జనకాత్మజా జానకీ జగదంబ రూపిణి జ్యోతిర్మయి,
శుభలక్షణ శోభితాంగి శశిముఖి శాంతస్వరూపిణి;
రఘువంశ తిలకుడైన రాముని హృదయరత్నమై,
భువనమంత వెలుగొందె భక్తజన పావన సౌభాగ్యము!

మృదుమందహాస విహారిణి మానస సరస్సు కమలమై,
మంగళ గుణగణ గర్భిణి మాతృస్వరూపిణి మాధుర్యమై;
అరణ్యాంతర గాఢవిపినమున అనుబంధమై నిలిచినది,
అనురాగ దీప్తి సాక్షిగా అచంచల సత్యసంకల్పమై!

రామో విగ్రహవాన్ ధర్మో రమణీయ గుణసాగరో,
సీతా సహచర్యమున్ సదా సౌమ్యమూర్తి సుపావనుడు;
సముద్రం సైతం సంభ్రమించు శౌర్య గంభీర వైభవం,
సేతుబంధ కీర్తి సాక్షిగా సాగరమే స్తుతించెను!

విరహాగ్ని వేడిలోనూ విశ్వాస దీప్తి మాయంకాక,
సీతా హృదయం సత్యసింధు స్ఫటికమై నిలిచెను;
రాముని నామస్మరణే రక్షణమై మార్గదర్శిగా,
ధర్మదీపికగా దివ్యదాంపత్య గాథను నిలిపెను!

అశోకవాటికలో ఆర్తిగా నిలిచిన ఆ మంగళ రూపం,
అమృతధారల కన్నీరై ఆకాశమున్ పలికె గాథ;
ఆ దుఃఖ గాఢతను చీల్చి ఆంజనేయుని దర్శనముతో,
ఆశల చిగురులు విరిసె ఆత్మవిశ్వాస సాక్షిగా!

లంకాపురి లయగర్జనలో రామబాణ జ్వాలలతో,
దశముఖ దర్ప దహనమై ధర్మజయం ఘోషించగా;
సీతా రాముల కలయికలో సర్వలోక మంగళ గానం,
సత్యసంధాన సౌభాగ్యమై సకలజన హృదయముల నిండె!

శ్రీరామ సీతల నామమిదే శాశ్వత మంత్రస్వరూపము,
చిత్తశుద్ధి చెలిమెలై చిగురించే చైతన్య దీపము;
భక్తి పరవశ తరంగిణిలో భవసాగరము దాటించు,
పరబ్రహ్మ సాక్షాత్కార పథమిదే పావన సత్యము

చైత్రమాస శుక్లపక్ష నవమి పుణ్యకళ్యాణ పర్వదినంబున,
సేవాసౌభాగ్య సుధాసింధువై నా చిత్తమున్ పరిపూర్ణమై;
మంజుల పత్తిపాటి మృదులకరాంబుజములందు
శ్రీ సీతారామ కల్యాణ కృత్యము సుగంభీరమై సాగుచుండగా,
కరుణామయ! కటాక్ష కృపాప్రవాహమే కలిగించితివి ఈ మహాభాగ్యమున్ రామయ్య!
భక్తి పరవశ హృదయంతో శరణాగతి సమర్పించగా,
జన్మార్థక పరమసాఫల్యమై జయనినాదములై విరిసె!
శ్రీ సీతారామ చరణారవింద సేవాసుధా ప్రసాదమున్ స్ఫూర్తి సింధువై,
మంజుల కలమున్ కళామాత కృపతో పద్యరత్నాల వికాసమై;
భక్తహృదయ భావసుమాల వాక్సుధా ప్రవాహమున్ వెలిగించగా,
సీతారామ కటాక్షమే ధన్యజీవిత సత్యమై నిలిచె!

**శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ శుభాకాంక్షలు!**

రచన: మంజుల పత్తిపాటి
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్,
చరవాణి 9347042218
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం.

# గ్రామాలను అనుసంధానం చేస్తూ ప్రతి మండల కేంద్రానికి ఆర్టిసి బస్సుల సౌకర్యం

## రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి



వనపర్తి, మార్చి 26 (పోలీస్ నిఘా) : వనపర్తి నియోజకవర్గంలోనీ ప్రతి గ్రామానికి ఆర్టిసి బస్సు సౌకర్యం కల్పించేందుకు వనపర్తి ఆర్టిసి డిపోకు కొత్తగా 20 ఆర్ టి సి బస్సులు కావాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి కోరారు. గురువారం రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన అసెంబ్లీ హాల్ 1 లో నిర్వహించినా ప్రత్యేక సమావేశంలో పలువురు ఎమ్మెల్యే లు ఆర్టిసి యాజమాన్యం, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘా రెడ్డి మాట్లాడుతూ, వనపర్తి పట్టణంలోని ఆర్టీసీ డిపో బస్టాండ్ వైపు రోడ్డులో డిపో గోడలకు అనుసంధానంగా ఉన్న చిరు వ్యాపార సముదాయాలను, వెనకాలకు జరిపి కట్టుకునే విధంగా చేసి రోడ్డు వెడల్పుకు ఆర్టీసీ డిపో యాజమాన్యం సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. వనపర్తి జిల్లా కేంద్రంలో 20 ఎకరాలలో కొత్త బస్ డిపో నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఉన్న పాత డిపో స్థలంలో పట్టణ అభివృద్ధిని కాంక్షిస్తూ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు వనపర్తి డిపోకు కొత్తగా 20 బస్సులను మంజూరు చేయాలని మంత్రి ని కోరారు వనపర్తి పట్టణంలో రెండు మినీ బస్సులను (సిటీ బస్సు మాదిరిగా) ఏర్పాటు చేయాలని దీంతో వనపర్తి లోని విద్యార్థులకు వ్యాపారస్తులకు ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు వనపర్తి నియోజకవర్గం లోని అన్ని గ్రామాల నుంచి ఆయా మండల కేంద్రాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినట్లు ఆయన తెలిపారు పెబ్బేరు నుంచి కొల్లాపూర్ వయా యాపర్ల గుమ్మడం, గుమ్మడం తండా, చిన్న గుమ్మడం కలుపుతూ ఉదయం, సాయంత్రం బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరిన ఎమ్మెల్యే వనపర్తి నుంచి వయా మానాజిపేట్ మహబూబ్నగర్కు నాలుగు ట్రిప్పులు అదనంగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు వనపర్తి – పెద్దమందడి మండల కేంద్రానికి షటిల్ బస్ ఏర్పాటు చేసి రోజు పది ట్రిప్పులు తిరిగేలా చూడాలన్నారు

వనపర్తి జిల్లా... రోడ్డు ట్రాన్స్పోర్ట్ కార్యాలయానికి నూతన భవన నిర్మాణం కోసం అప్పయ్యపల్లి దగ్గర కేటాయించిన స్థలంలో వెంటనే కార్యాలయ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేకోరారు. అదేవిధంగా వనపర్తి, పెబ్బేరు పట్టణాల్లోని ఆర్టీసీ బస్టాండ్లలో నిర్మించనున్న సిసి బెడ్ లకు సంబంధించి వనపర్తి బస్టాండ్ కు 2.50 కోట్లు మంజూరు అయి ఉన్నాయని, అదేవిధంగా పెబ్బేరు బస్టాండ్ లోని సిసి బెడ్ నిర్మాణా నికి రూ. 1. 20 కోట్ల రూపాయలు మంజూరై ఉన్నాయని వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

# ఏపీలో ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

వీరిలో బస్సు వెనుక భాగంలో ఉన్నవారు బయటకు రాలేక మృతిచెందినట్లు తెలుస్తోంది. ముందు భాగంలో ఉన్నవారు ప్రాణాలతో బయటపడ్డారు. మృతుల్లో కనిగిరి, వింజమూరు, ఉదయగిరి ప్రాంతాలకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ఘటనాస్థలాన్ని మార్కాపురం జేసీ శ్రీనివాసులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరిశీలించారు. మృతుల వివరాలు.. సీహెచ్ మనోజ్‌కుమార్ (18), వింజమూరు, సీహెచ్ సుజాత (45), వింజమూరు, సీహెచ్ మేఘన (19), వింజమూరు, టి.నరేంద్ర (25), నల్లగొండ్ల, టి.చందన (21), నల్లగొండ్ల, టి.చందు (6), నల్లగొండ్ల, కె.ప్రకాశ్ (17), అయ్యవారిపల్లె, కె.అయ్యన్న (18), (ఎర్రబొట్లపల్లె) వి.గురవయ్య (60), చింతగుంట్ల, కె.అబ్రహం (42), చోడవరం, పి.మహేంద్రరెడ్డి (17), చోడవరం రామచంద్ర ప్రవీణ్ (21), చోడవరం, ఎ.సౌజన్య (22), పెదారికట్ల ఉన్నారు. ఈ ప్రమాదంపై సీఎం చంద్రబాబు,ప్రధాని మోడీ, మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సులోని పలువురు ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తెలంగాణలోని నిర్మల్ నుంచి నెల్లూరుకు ఈ బస్సు వెళుతున్నట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. బస్సు ప్రమాదంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై ఏపీ అధికారులతో మాట్లాడాలని సీఎస్ రామకృష్ణారావును ఆదేశించారు. సీఎం ఆదేశాలతో ఏపీ సీఎస్‌తో తెలంగాణ సీఎస్ మాట్లాడారు.

# వర్షాకాలం సన్నద్ధతపై పోలీస్ - జీహెచ్‌ఎంసీ సమన్వయ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

150 కోట్ల రూపాయల నిధులను కేటాయించినట్లు కమిషనర్ వెల్లడించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఒక్కో జోన్‌కు 25 కోట్ల రూపాయల చొప్పున ఈ నిధులను కేటాయించామని, వీటి ద్వారా ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన పనులను చేపడతామని ఆయన వివరించారు. నగర సీపీ శ్రీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ.. రెండు విభాగాల మధ్య ఇలాంటి కన్వర్జెన్స్ సమావేశాలు జరగడం వల్ల క్షేత్రస్థాయి సమస్యలను అత్యంత వేగంగా పరిష్కరించవచ్చని అభిప్రాయపడ్డారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పాదచారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో హైదరాబాద్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) శ్రీ.డి.జోయల్ డేవిస్,ఐపిఎస్, డీసీపీలు అవినాష్ కుమార్, కాజల్, బి.కె. రాహుల్ హెగ్డేలతో పాటు జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్లు శ్రీమతి ప్రియాంక అలా, శ్రీ ముకుంద రెడ్డి , శ్రీ శ్రీనివాస్ రెడ్డి, జోనల్ కమిషనర్, చార్మినార్, జీహెచ్‌ఎంసీ,శ్రీమతి చంద్రకళ, జోనల్ కమిషనర్, శంషాబాద్, జీహెచ్‌ఎంసీ,శ్రీమతి మంగతాయారు, జోనల్ కమిషనర్, సికింద్రాబాద్, జీహెచ్‌ఎంసీ, శ్రీ శ్రీనివాస్, చీఫ్ సిటీ ప్లానర్ (ప్రధాన నగర ప్రణాళికాధికారి), జీహెచ్‌ఎంసీ, శ్రీ రత్నాకర్, చీఫ్ ఇంజనీర్ (ప్రధాన ఇంజనీర్), పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# సీఎస్ఆర్ నిధుల సమీకరణ, వినియోగానికి ప్రత్యేక విధానం: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 26 (పోలీస్ నిఘా) : కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులు సమీకరణతోపాటు, వాటిని సమర్థంగా వినియోగించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎస్ఆర్ నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టే కార్పొరేట్ సంస్థలను ప్రభుత్వం తరఫున అభినందించాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో సీఎస్ఆర్ సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలోని కార్పొరేట్ కంపెనీలు సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న కార్యక్రమాల వివరాలు, అన్ని ప్రభుత్వ విభాగాల్లో అందుబాటులో ఉన్న ప్రాజెక్టులు, సీఎస్ఆర్ ద్వారా చేపట్టేందుకు వీలున్న కార్యక్రమాల వివరాలను సమన్వయం చేసే బాధ్యత రాష్ట్ర స్థాయి సెల్ నిర్వహిస్తుందని చెప్పారు. ప్రభుత్వానికి, కార్పొరేట్ సంస్థలకు అనుసంధానంగా ఉండేలా ప్రత్యేకంగా సీఎస్ఆర్ పోర్టల్ రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించాలి: కలెక్టర్



వనపర్తి, మార్చి 26 (పోలీస్ నిఘా) : గురువారం జిల్లా కలెక్టర్ గోపాలపేట మండల పరిధిలో బుద్ధారం గ్రామాన్ని సందర్శించి, నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లు, డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో గతంలో మంజూరై వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించారు. ఇప్పటికే మంజూరు చేసిన ఈ ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారులను త్వరగా గుర్తించాలని తహసిల్దార్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల కమిటీని ఆదేశించారు. లబ్ధిదారులకు త్వరలోనే పట్టాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ డబల్ బెడ్ రూమ్ ఇండ్ల విషయంలో గతంలో కొందరు అకతవకలకు పాల్పడ్డారని కొందరు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణం కోసం ఎవరితోనూ అప్పులు చేయవద్దని సూచించారు. ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక అవసరం ఉంటే స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ పీడీ విఠోబా, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి విజయ్ కుమార్, తహసిల్దార్ తిలక్ రెడ్డి, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# మున్సిపల్ పన్నులను 100 శాతం వసూలు చేయాలి

## -జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య-




మంచిర్యాల, మార్చి 26 (పోలీస్ నిఘా) : మున్సిపల్ పరిధిలో పన్నులను 100 శాతం వసూలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయాన్ని సందర్శించి మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ తో కలిసి పన్నుల వసూలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధి కొరకు పన్ను వసూలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న బకాయిలను త్వరితగతిన వసూలు చేసే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. పన్నుల వసూలు లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు అందించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వేసవికాలం అయినందున ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులు నిబంధనల ప్రకారం త్వరగా ఇల్లు నిర్మించుకునేలా అధికారులు అవగాహన కల్పించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


# శ్రీ భద్రకాళీ దేవస్థానంలో వసంత నవరాత్ర మహోత్సవములు ఎనిమిదవ రోజుకు చేరుకున్నాయి



వరంగల్, మార్చి 26 (పోలీస్ నిఘా) : ఎనిమిదవ రోజు కార్యక్రమాలలో (దివి: 26-03-2026 గురువారం) భాగంగా ఉదయం సుప్రభాత సేవ, నిత్యాహ్నికం జరుపడిన పిమ్మట కల్పోక్త ప్రకారం వసంత నవరాత్ర ఉత్సవాల సందర్భంగా జరుపవలసిన విశేష జపహె?మార్చనాభిషేకములు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి లక్ష పసుపు రంగు చామంతికా (చామంతి) పూలతో లక్షపుష్పార్చన జరిపి అమ్మవారికి నివేదనలు సమర్పించి భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. ఈ రోజు లక్షపుష్పార్చన కార్యక్రమానికి ఉభయదాతలుగా శ్రీ పాజూరి శ్రీరాం-శ్రావణి, శ్రీమతి సబిత, సమత, పబ్బ శివకుమార్-స్రవంతి, బీయాల అంజన్న-అక్షర గార్లు వ్యవహరించారు. ఈ రోజు కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు శ్రీమతి మోతుక్కురి మయూరి, శ్రీమతి గాండ్ల స్రవంతి, శ్రీమతి నార్ల సుగుణ, శ్రీ అనంతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొని పూజానంతరం ఉభయదాతలకు అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు.

# బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా యడ్లపల్లి రమేష్





ఖమ్మం, మార్చి 26 (పోలీస్ నిఘా) : గురువారం జరిగిన ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలలో అధ్యక్షుడి గా సీనియర్ న్యాయవాది యడ్లపల్లి రమేష్ గెలుపొందినారు. గురువారం ఉదయం 10గంటల నుండి సాయంత్రం 4-30:గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. మొత్తం 981 ఓట్ల కు గాను 855 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నార ని ఏన్నికల అధికారి ప్రకటించారు అధ్యక్షు పదవికి ముగ్గురు పోటి పడగా ఇద్దరి మద్యనే ప్రదాన పోటీ జరిగింది. అధ్యక్షునిగా యడ్లపల్లి రమేష్(349) ప్రధాన కార్యదర్శి గా కొప్పుల రవి కుమార్ మిగతా పోస్టులు కుఅభ్యర్థులు ఏకగ్రీవంగా ఏన్నికైనట్లు ఏన్నికల అధికారి పీఏజె శేఖర్ రాజ్ ప్రకటించారు. ఫలితాల అనంతరం న్యాయవాదులు సంబరాలు చేసుకున్నారు. నూతన కార్యవర్గానికి సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

# జాతీయ రహదారి విస్తరణలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి: కలెక్టర్



మందమర్రి, మార్చి 26 (పోలీస్ నిఘా) : జాతీయ రహదారి 63 విస్తరణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని మందమర్రి మండలం తిమ్మాపూర్ ప్రాంతంలో ఆర్మూర్ నుండి చంద్రాపూర్ జాతీయ రహదారి 63 పనులను మండల తహసిల్దార్ సతీష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన జాతీయ రహదారి విస్తరణ పనులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మందమర్రి మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలు తీరును మండల తహసిల్దార్ సతీష్, మున్సిపల్ కమిషనర్ రాజలింగులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని తెలిపారు. ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించాలని, మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను నిబంధనలకు లోబడి చేపట్టేలా అవగాహన కల్పించాలని, నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

మున్సిపల్ పరిధిలోని ఇంటి పన్ను, ఇతర పన్నులను 100 శాతం వసూలు చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. మున్సిపల్ పరిధిలోని డంపింగ్ యార్డును సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. నివాసాల నుండి సేకరించిన చెత్తలో ఉపయోగకరమైన వాటిని వేరుచేసి సెగ్రిగేషన్ షెడ్ కు తరలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


పోలీస్ నిఘా

సంపాదకీయం | శుక్రవారం | 27 మార్చి 2026

## వృద్ధుల భద్రత దిశగా ముందడుగు

తెలంగాణలో కుటుంబ విలువలను కాపాడే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గం ఆమోదించిన తల్లిదండ్రుల మద్దతు బిల్లు వృద్ధుల సంరక్షణను చట్టబద్ధ బాధ్యతగా మలుస్తోంది. వేగంగా మారుతున్న సామాజిక పరిస్థితుల్లో కుటుంబ బంధాలు సడలుతున్న నేపథ్యంలో తీసుకున్న ఈ చర్య సమయోచితమనే చెప్పాలి. తల్లిదండ్రులపట్ల బాధ్యతను విస్మరించేవారికి కఠిన సందేశం ఇస్తూనే, వృద్ధుల గౌరవానికి భరోసా కల్పించే దిశగా ఈ బిల్లు ముందడుగుగా నిలుస్తోంది. భారతీయ సంస్కృతిలో మాతృదేవోభవ, పితృదేవోభవ అనే సూత్రం శాశ్వతమైనది. కానీ ఆధునిక జీవనశైలిలో వేగంగా పెరుగుతున్న నగరీకరణ, వలసలు, వ్యక్తివాదం వంటి పరిణామాల నేపథ్యంలో కుటుంబ బంధాలు క్రమంగా సడలుతున్నాయి. ఈ మార్పుల ప్రభావం అత్యంత స్పష్టంగా కనిపిస్తున్న వర్గం వృద్ధులు. ఆర్థిక అసురక్షితత, ఆరోగ్య సమస్యలు, భావోద్వేగ ఒంటరితనం– ఇవి వారి దైనందిన వాస్తవాలుగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అవసరం అనివార్యమైంది. ఈ నేపథ్యంలో జనవరి 12, 2026న సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినట్టుగా, బడ్జెట్ సెషన్‌లో ప్రవేశపెట్టిన ఈ బిల్లు కేంద్ర Maintenance and Welfare of Parents and Senior Citizens Act,, 2007ని రాష్ట్ర స్థాయిలో కఠినతరం చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతిపాదించిన బిల్లు ప్రకారం, తల్లిదండ్రులను ఆదరించని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల వేతనాల నుంచి 15% లేదా రూ. 10,000 (ఏది తక్కువైతే అది) కోత విధించి, ఆ మొత్తాన్ని నేరుగా తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేసే విధానం అమల్లోకి రానుంది. ఈ నిర్ణయం ద్వారా ప్రభుత్వం ఒక స్పష్టమైన సందేశం ఇచ్చింది –కుటుంబ బాధ్యతను విస్మరించడం సహించబోమని. ఇది నైతిక బాధ్యతను చట్టబద్ధ బాధ్యతగా మలచే ప్రయత్నంగా చెప్పాలి. అయితే ఈ బిల్లులో అత్యంత గమనార్హ అంశం–దాని అమలు విధానంలో ఉన్న సమతుల్యత. తల్లిదండ్రుల ఫిర్యాదు వచ్చిన వెంటనే శిక్ష విధించడం కాకుండా, సంబంధిత ఉన్నతాధికారుల సమగ్ర విచారణ అనంతరం మాత్రమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడం ప్రశంసనీయం. కుటుంబ విభేదాలు అనేక కోణాల్లో ఉండే సందర్భంలో, ఒకపక్ష నిర్ణయాలకు తావు లేకుండా వ్యవస్థను రూపొందించడం పరిపక్వతకు నిదర్శనం. ఈ విధానం చట్ట దుర్వినియోగ అవకాశాలను గణనీయంగా తగ్గించే అవకాశం ఉంది. ఇప్పటికే దేశంలో అమల్లో ఉన్న వృద్ధులకు చట్టపరమైన రక్షణను అందిస్తున్నప్పటికీ, దాని అమలులో అనేక పరిమితులు ఉన్నాయన్నది వాస్తవం. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ బిల్లు, ఆ చట్టాన్ని మరింత ప్రభావవంతంగా అమలు చేసే దిశగా ఒక పూరక చర్యగా నిలుస్తోంది. ముఖ్యంగా ప్రత్యక్ష ఆర్థిక మద్దతు విధానం, వృద్ధులకు తక్షణ ఉపశమనాన్ని అందించే అవకాశాన్ని కల్పిస్తోంది. డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా మంత్రివర్గం మొత్తం ఈ నిర్ణయాన్ని సమగ్రంగా పరిశీలించి ఆమోదించడం, కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక సమస్యలపై ఎంత సున్నితంగా స్పందిస్తోందో స్పష్టం చేస్తోంది. ఈ బిల్లుతోపాటు ఆమోదించిన హేట్ స్పీచ్ నిరోధక చట్టం, గిగ్ వర్కర్ల సంక్షేమ చట్టం (4.2 లక్షల మందికి రిజిస్ట్రేషన్, సంక్షేమ బోర్డు)కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయ దిశగా చేస్తున్న ప్రయత్నాలకు భాగం. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు మాత్రమే కాకుండా సమాజం మొత్తానికి ఇది ఒక నైతిక హెచ్చరిక– బాధ్యతలను విస్మరించడాన్ని ప్రభుత్వం సహించదనే సందేశం. సామాజికంగా చూస్తే, ఈ నిర్ణయం ఒక హెచ్చరిక మాత్రమే కాదు ఒక అవగాహన పిలుపు. కుటుంబ విలువలను చట్టం ద్వారా కాపాడే ప్రయత్నం అరుదైనదే అయినప్పటికీ, అవసరమైనదిగా మారింది. పాఠశాల స్థాయి నుంచి సమాజం వరకు వృద్ధులపట్ల గౌరవాన్ని పెంపొందించే చర్యలు కూడా సమాంతరంగా సాగాల్సిన అవసరం ఉంది. చట్టం కేవలం నియంత్రణ సాధనం మాత్రమే కానీ విలువల మార్పు అవగాహన ద్వారానే సాధ్యం. అయితే, ఈ బిల్లును అమలు చేసే ప్రక్రియలో సవాళ్లు లేవని చెప్పలేం. తల్లిదండ్రులను ఆదరించడం లేదనే అంశాన్ని కొలిచే ప్రమాణాలు స్పష్టంగా నిర్వచించాల్సిన అవసరం ఉంది. కుటుంబ సంబంధాలు స్వభావత: సంక్లిష్టమైనవి. ఆర్థిక సహాయం ఉన్నా భావోద్వేగ దూరం ఉండవచ్చు; లేదా వ్యతిరేకంగా కూడా ఉండవచ్చు. ఇలాంటి సందర్భాల్లో వ్యవస్థ ఎలా స్పందిస్తుంది అన్నది కీలకం. అలాగే ప్రైవేటు రంగంలో వేతనాల నుంచి కోత విధించే విధానం చట్టపరంగా, సాంకేతికంగా స్పష్టత అవసరం. ఇంకా ఒక కోణంలో చూస్తే, ఈ బిల్లు సామాజిక భద్రతా వ్యవస్థలో ఉన్న లోటును కూడా ప్రతిబింబిస్తుంది. వృద్ధులు పూర్తిగా పిల్లలపై ఆధారపడకుండా ఉండేలా పింఛన్‌లు, ఆరోగ్య భద్రత, వృద్ధాశ్రమాలు వంటి మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా ప్రభుత్వం ఇప్పటికే చేపట్టిన చర్యలు మరింత విస్తరించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధుల సంక్షేమానికి బలమైన భద్రతా వ్యవస్థను కూడా ఏర్పాటు చేస్తోంది. పింఛన్ పథకాలు, ఆరోగ్య సేవలు, 'ఇందిరమ్మ లైఫ్ ఇన్సూరెన్స్' వంటి కార్యక్రమాలు కుటుంబాలపై ఒత్తిడి తగ్గించి, పరస్పర గౌరవం పెంచుతాయి. ఈ బిల్లు ద్వారా ప్రభుత్వం సామాజిక భద్రతా లోటును పూర్తి చేస్తూ, 'ఇందిరమ్మ రాజ్యం' స్ఫూర్తిని భావనాత్మకంగా అమలు చేస్తోంది. మొత్తానికి, తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఇందిరమ్మ రాజ్యం స్ఫూర్తిని ప్రతిబింబించే సంస్కరణ. ఇది కేవలం చట్టపరమైన మార్పు కాదు సామాజిక విలువలను పునరుద్ధరించే ఉద్యమం. సరైన అమలు, ప్రజల సహకారం ఉంటే, ఈ పథకం దేశానికి మార్గదర్శకంగా నిలిచే అవకాశం ఉంది. చివరగా ఒక స్పష్టమైన సందేశం 'తల్లిదండ్రులను చూసుకోవడం కేవలం బాధ్యత కాదు, అది మన సంస్కృతి'. ఆ విలువలను కాపాడేందుకు ప్రభుత్వం ముందడుగు వేయగా, ప్రతి పౌరుడు కూడా తన వంతు బాధ్యతను నిర్వర్తించాల్సిన సమయం ఆసన్నమైంది.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్




వరంగల్ జిల్లా/చెన్నారావుపేట, మార్చి 26 (పోలీస్ నిఘా) : చెన్నారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సిబ్బంది హాజరును పరిశీలించారు. కేంద్రం లో అందిస్తున్న వైద్య సేవలను సమీక్షించి, రోగులకు అందుతున్న చికిత్స విధానంపై ఆరా తీశారు. ఔషధ నిల్వ లను పరిశీలించి, అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకో వాలని సూచించారు. కలెక్టర్ వెంట.అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా వైద్య ఆరోగ్యా ధికారి డాక్టర్ సాంబ శివరావు తది తరులు పాల్గొన్నారు.

# యుద్ధం ముగిసినా.. గ్యాస్ కష్టాలు తప్పవా?



యుద్ధం ముగిసినా దాని ప్రభావం కొన్నాళ్లుపాటు ఉంటుందని ప్రధాని నరేంద్రమోదీ లోక్‌సభ వేదికగా వెల్లడించారు. ఆయన మాటలు అక్షరాలా నిజమే. ఎందుకంటే ఇరాన్–అమెరికా మధ్య యుద్ధం ఆగినా, ఎల్‌పీజీ గ్యాస్ రావడం కష్టమేనని అంటు న్నారు. ఎందుకంటే ఒఔఉ ప్లాంట్ దెబ్బతినడమే అందుకు కారణమా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.


**యుద్ధం ముగిసినా గ్యాస్‌కు కష్టాలు**

ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ మెరుపు దాడులు ప్రపంచదేశాలను ఆర్థిక కష్టాల్లోకి నెట్టేశాయి. ఆ యుద్ధం ప్రభావం అన్నింటి కంటే ఎక్కువగా ఆసియాపై ఎక్కువగా కనిపిస్తోంది. హోర్ముజ్ జలసంధికి తెరవడానికి రావాలని మిత్రులకు తమతో కలిసి రావాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రావాలని పదే పదే కోరినా ఏ మాత్రం ఫలితం లేదు. ఎందుకంటే తమ దేశ ఆర్థిక వ్యవస్థలు పతనం తప్పదని భావిస్తున్నాయి. ఖతార్‌లోని రాస్ లాఫాన్ ఎల్ఎన్‌జి ప్లాంట్‌కు నిలయం. ప్రపంచంలోనే అతి పెద్దది కూడా. ప్రస్తుతం కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా ఆ ప్లాంట్‌లో రెండు ప్రధాన ఉత్పత్తి విభాగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న ప్రాంతాలు ఉత్పత్తికి కీలకం. అయితే వాటిని తిరిగి కార్యకలాపాలకు అనుకూలంగా మార్చడానికి చాలా కాలం పట్టే అవకాశాలు ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు.

**ఖతార్ గ్యాస్ ప్లాంట్ ఉత్పత్తికి నాలుగేళ్లు తప్పవని ఎనర్జీ కంపెనీ నివేదిక**

శీతలీకరణ కంప్రెషర్ల కోసం కొత్తగా భారీ గ్యాస్ టర్బైన్‌లు అవసరమవుతున్నాయని చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా గ్యాస్ టర్బైన్‌కు తయారు చేసే దేశాలకు ఆర్డర్ల భారీగా ఉన్నాయి. వాటిని ఆపి ఖతార్ గ్యాస్ రిఫైనరీ కోసం తయారు చేయాలంటే భారీ ఖర్చుతో కూడిన పని. ఒకవేళ టర్బైన్‌లను తయారు చేసి వాటిని ప్లాంట్‌కు అమర్చే ప్రక్రియ సుదీర్ఘంగా సాగుతుందని అంటున్నారు. అందుకోసం రెండు లేదా నాలుగు సంవత్సరాల సమయం పట్టే అవకాశం ఉందని ఓ ఎనర్జీ తయారీ కంపెనీ నివేదిక చెబుతోంది. ఈ లెక్కన ఎటుచూసినా ఖతార్ నుంచి ఎల్‌పీజీ గ్యాస్ రావాలంటే రెండు లేదా నాలుగేళ్లు సమయం పట్టే అవకాశముందని అంటున్నారు. అప్పటివరకు ఆసియా దేశాలకు కష్టాలు తప్పవన్నమాట. హోర్ముజ్ జలసంధి ద్వారా చమురుపై అత్యధికంగా ఆధారపడే దేశాలు ఈ విధంగా ఉన్నాయి. అందరి కంటే జపాన్ అత్యధికంగా 73 శాతం గల్ఫ్ నుంచి వెళ్లాలి. ఆ తర్వాత సౌత్ కొరియా–70 శాతం, ఇండియా–42 శాతం, చైనా–45, పాకిస్థాన్, తైవాన్ లు–60, థాయ్‌లాండ్–35, సింగపూర్–30, మలేషియా–30 శాతం ఉన్నాయి. ఫిలిప్పీన్–25, ఇండోనేషియా–25, వియత్నాం–20, ఇటలీ–15, స్పెయిన్ 15, అమెరికా రెండు నుంచి ఐదు శాతం వరకు మాత్రమే. ఒక్కమాటలో చెప్పాలంటే గల్ఫ్ మండిపోతోంది.. హోర్ముజ్ ఊపిరాడటం లేదు. ఇప్పుడు ప్రతీ దేశం చమురుపై రష్యా, అమెరికాపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక భారత్ విషయానికి వద్దాం. రీసెంట్ ప్రధాని మోదీ మాట్లాడుతూ ఒకప్పుడు చమురును 27 దేశాల నుంచి దిగుమతి చేసుకునే వాళ్లమని, ప్రస్తుతం 41 దేశాలకు పెంచినట్టు తెలిపారు. రష్యా, ఆఫ్రికా, సౌత్ అమెరికా నుంచి భారత్‌కు గ్యాస్ రావాల్సి వుంటుంది. ఖర్చు కూడా పెరుగుతుందన్నమాట. ఎలాగ చూసినా ధరలు పెరగడం ఖాయం.

## శ్రీరామనవమి జరుపుకోవడంలో ఉన్న అంతర్యం ఏమిటి?



శ్రీరామనవమిని జరుపుకోవడంలో ఉన్న అంతర్యం ఏమిటో తెలుసా..? రామనవమిని కేవలం ఒక పండుగగా మాత్రమే కాకుండా, దాని వెనుక ఉన్న ఆధ్యాత్మిక, సామాజిక మరియు వ్యక్తిత్వ వికాసపరమైన అంతరార్థాలను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. రాముడు మర్యాద పురుషోత్తముడు. ఆయన జీవన విధానమే ఒక ధర్మశాస్త్రం. శ్రీరామ నవమి వెనుక ఉన్న ముఖ్యమైన అంతరార్థాలు చాలానే ఉన్నాయి వాటిలో ముఖ్యమైన వాటి గురించి ఇప్పుడు ఈ కథనంలో తెలుసుకుందాం.

ధర్మో రక్షతి రక్షితః (ధర్మమే ఆధారం): రామాయణం మొత్తం "ధర్మం" చుట్టూ తిరుగుతుంది. రాముడు తన వ్యక్తిగత సుఖాలను, రాజ్యాన్ని త్యజించి ధర్మాన్ని పాటించాడు. శ్రీరామనవమి నాడు రాముడిని పూజించడం అంటే, మన జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా ధర్మాన్ని విడిచిపెట్టకూడదు అనే సంకల్పాన్ని గుర్తు చేసుకోవడం అంటున్నారు పండితులు.

ఆదర్శవంతమైన వ్యక్తిత్వ నిర్మాణం: రాముడు కేవలం దైవం మాత్రమే కాదు, ఒక మనిషిగా ఎలా జీవించాలో నిరూపించాడు. తండ్రి మాట కోసం రాజ్యాన్ని వదులుకున్న ఆదర్శ కుమారుడు రాముడు. అలాగే సీతమ్మ పట్ల ఆయన చూపిన ప్రేమ, గౌరవం, ఆమెను తిరిగి పొందేందుకు చేసిన పోరాటం అద్వితీయం. అందుకే రాముడిని ఒక ఆదర్శ భర్తగా కూడా కొనియాడతారు. ఇక భరత, లక్ష్మణ, శత్రుఘ్నులతో ఆయన చూపిన అనుబంధం అపారమైనది. ఆ విషయ ంలో కూడా రాముడు ఆదర్శ సోదరుడిగా నిలిచిపోయాడు.

అంతఃకరణ శుద్ధి (శరణాగతి): రాముడు శరణాగత వత్సలుడు. విభీషణుడు, సుగ్రీవుడు వంటి వారు ఆశ్రయించగానే వారిని అక్కున చేర్చుకున్నాడు. శ్రీరామనవమి మనకు అహంకారాన్ని వదిలి భగవంతునిపై భారం వేయడం (శరణాగతి) అనే మార్గాన్ని చూపుతుంది. కంచర్ల గోపన్న (భక్త రామదాసు) కథ దీనికి గొప్ప ఉదాహరణ.

కాల చక్రం మరియు ప్రకృతి సమతుల్యత: శ్రీరామనవమి చైత్ర మాసంలో వస్తుంది. ఇది వసంత రుతువులో ఉంటుంది. అంటే, ప్రకృతి కొత్త చిగుళ్లతో కళకళలాడుతున్న సమయం. ఇది ఒక కొత్త ఆరంభానికి సంకేతం. వేసవి మొదలవుతున్న తరుణంలో శరీరాన్ని చల్లబరిచే పానకం, వడపప్పు ప్రసాదంగా తీసుకోవడం వెనుక ఉన్న ఆయుర్వేద అంతరార్థం ప్రకృతితో అనుసంధానమై ఆరోగ్యకరమైన జీవనం గడపడం అంటున్నారు పండితులు.

అజ్ఞానంపై జ్ఞానం విజయం సాధించడం: రావణుడు అజ్ఞానానికి, అహంకారానికి ప్రతీక. రాముడు జ్ఞానానికి, వివేకానికి ప్రతీక. సీతాదేవిని (జ్ఞానం లేదా ప్రకృతిని) రావణుడి (అహంకారం) నుండి రాముడు (ఆత్మ/వివేకం) విడిపించడం అనేది మనిషి తనలోని అజ్ఞానాన్ని, అహంకారాన్ని జయించి, ఆత్మజ్ఞానాన్ని పొందే ప్రక్రియకు ప్రతీకగా చెప్తుంటారు.

సమాజ శ్రేయస్సు (రామరాజ్యం): రామరాజ్యం అంటే కేవలం ఒక కల్పిత రాజ్యం కాదు, అక్కడ భయం, వ్యాధి, పేదరికం లేని సమాజం. ప్రతి ఒక్కరి హృదయంలో రామ తత్వాన్ని నింపుకుంటే, అటువంటి సమాజాన్ని మనం కూడా నిర్మించుకోగలమని ఈ పండుగ గుర్తు చేస్తుంది.

శ్రీరామనవమి అంటే కేవలం బొమ్మల పూజ కాదు. రాముడిలోని నిబద్ధత, పరోపకారం, క్రమశిక్షణలను మన వ్యక్తిత్వంలో భాగం చేసుకోవడమే ఈ పండుగ యొక్క అసలైన అంతరార్థం. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఆయన గుణాలను స్మరించుకోవడం ద్వారా, మనం కూడా మన కుటుంబ సంబంధాల్లో సహనం, బాధ్యత, ప్రేమను పెంపొందించుకోవాలని ఈ పండుగ బోధిస్తుంది.

# శ్రీ రామనవమికి ముస్తాబయిన రామ మందిరాలు





శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని అయోధ్యలోని భవ్య రామమందిరం మునుపెన్నడూ లేని విధంగా ముస్తాబయింది. నూతన ఆలయ ప్రతిష్ఠాపన జరిగిన తర్వాత వస్తున్న మొదటి రామ నవమి కావడంతో, ఈ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. దేశవిదేశాల నుంచి తెప్పించిన రంగురంగుల విదేశీ పుష్పాలు, సుగంధ భరితమైన స్వదేశీ పూలతో ఆలయ ప్రాంగణమంతా సర్వాంగ సుందరంగా అలంకరించబడింది. విద్యుత్ దీపాల కాంతులతో అయోధ్య నగరం ధగధగలాడుతూ సాక్షాత్తు వైకుంఠాన్ని తలపిస్తోంది.

**సూర్య తిలకం.. భక్తజన సంద్రం**

ఈ ఏడాది రామ నవమికి మరో ప్రత్యేకత ఏమిటంటే, బాలరాముడికి జరగనున్న 'సూర్య తిలకం' కార్యక్రమం. శాస్త్రవేత్తలు రూపొందించిన ప్రత్యేక ఆప్టో–మెకానికల్ వ్యవస్థ ద్వారా మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో సూర్య కిరణాలు నేరుగా బాలరాముడి నుదుటిపై ప్రసరించేలా ఏర్పాట్లు చేశారు. ఈ అద్భుత ఘట్టాన్ని వీక్షించేందుకు దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అధికారులు అదనపు ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శన సమయాన్ని పొడిగించడమే కాకుండా, ఎండ తీవ్రత దృష్ట్యా చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యాలను కల్పించారు.

**కళ్యాణానికి సిద్ధమైన భద్రాద్రి రామయ్య**

మరోవైపు దక్షిణ అయోధ్యగా పిలువబడే తెలంగాణలోని భద్రాచలం పుణ్యక్షేత్రం సీతారాముల కళ్యాణ మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. గోదావరి తీరాన వెలసిన ఈ దివ్య క్షేత్రంలో రేపు జరగనున్న జగదభిరాముడి కళ్యాణ వేడుకను కళ్లారా చూసేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఆలయ ప్రాంగణాన్ని మామిడి తోరణాలు, పూల మాలలతో అలంకరించి, పెళ్లి పందిరిని అత్యంత భక్తిశ్రద్ధలతో తీర్చిదిద్దారు. భక్త రామదాసు నిర్మించిన ఈ ఆలయంలో రామయ్య పెళ్లి వేడుక కనుల పండువగా జరగనుంది. భక్తుల కోసం సకల ఏర్పాట్లు చేశారు.

**తెలంగాణ ప్రభుత్వ అధికారిక ఏర్పాట్లు**

భద్రాచలంలో జరిగే సీతారాముల కళ్యాణానికి తెలంగాణ ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడమే కాకుండా, రవాణా సౌకర్యాల కోసం ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఎండల తీవ్రతను గమనించి భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్నదాన కార్యక్రమాలు, మంచినీటి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి భక్తుడికి స్వామివారి కళ్యాణ తలంబ్రాలు అందేలా కౌంటర్లను భారీగా పెంచారు.

**అంతటా రామనామ స్మరణ**

ఉత్తరాన అయోధ్య నుంచి దక్షిణాన భద్రాచలం వరకు భారతావని అంతా రామనామ స్మరణతో మారుమోగుతోంది. అయోధ్యలో నవ నిర్మిత మందిర శోభ, భద్రాద్రిలో సీతారాముల కళ్యాణ వైభవం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచుతున్నాయి. భద్రతా కారణ దృష్ట్యా, రద్దీని నియంత్రించేం దుకు ఆలయ పరిసరాల్లో డ్రోన్ కెమెరాలు, సీసీటీవీ నిఘాను పెంచారు. ఎక్కడ చూసినా జై శ్రీరామ్ నినాదాలు, భక్తి గీతాలతో వాతావరణం పవిత్రంగా మారింది. ఈ పండుగ వేళ భక్తులందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆ రామచంద్రుడిని ప్రార్థిస్తూ భక్తులు దర్శనాలకు సిద్ధమవు తున్నారు.

## 10 నెలల పసి ప్రాణానికి అరుదైన శస్త్ర చికిత్స

### హైదరాబాద్ యశోదలో ఘటన..

ఖమ్మం, మార్చి 26 (పోలీస్ నిఘా) : ఖమ్మం ప్రాంతానికి చెందిన 10 నెలల బాబు ఎముక మజ్జ వైఫల్యంతో బాధపడుతున్న తరుణంలో ఆ బాబు తల్లిదండ్రులు హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్ ను సంప్రదించంగా అక్కడ వైద్య బృందం అరుదైన శాస్త్ర చికిత్స అందించి వైద్యులు అత్యాధునిక హాప్లోయిడెంటికల్ స్టెమ్ సెల్ మార్పిడి చేసి కొత్త జీవితాన్ని అందించారని ఖమ్మం యశోద మెడికల్ సెంటర్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్ విక్రమ్ కుమార్ వెల్లడించారు . ఇది వారసత్వంగా వచ్చే అమెగాకార్యోసైటిక్ థ్రోంబోసైటోపెనియా అనే అరుదైన ఎముక మజ్జ వ్యాధి . గతేడాది డిసెంబర్ 26న సోమాజిగూడ యశోద ఆస్పత్రికి తీసుకొచ్చారు . సమగ్ర క్లినికల్ పరీక్షల అనంతరం అమె గాకార్యోసైటిక్ థ్రోంబోసైటోపెనియా ఉన్నట్లు మరియు ప్లేట్లెట్స్ కౌంట్ తక్కువగా ఉండటాన్ని గుర్తించారు . శస్త్రచికిత్స పూర్తిచేసుకున్న చిన్నారితో వైద్య బృందం నిర్ధారణ అయిందని ఇది తీవ్రమైన థ్రోంబోసైటోపె నియా , రక్తస్రావం , ప్రమాదంతో కూడిన అరుదైన వారసత్వంగా వచ్చే ఎముక మజ్జ వైఫల్య రుగ్మతగా గుర్తించి తండ్రి మూల కణాలను ఉపయోగించి హాప్లోయిడెంటికల్




స్టెమ్ సెల్ ట్రాన్స్ ప్లాంటేషన్ జనవరి 8న విజయవంతంగా నిర్వహించారు . బాబు వైద్యపరంగా స్థిరంగా ఉన్నాడని నిర్ధారించుకున్న తరువాత డిశ్చార్జ్ చేశామని ఆయన అన్నారు . ఈ కార్యక్రమంలో ఎమ్ ఆర్. శ్రీధర్ రావు , బాల కృష్ణ , నాగార్జున పాల్గొన్నారు.


## బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులను పరామర్శించిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



చెన్నారావుపేట, మార్చి 26 (పోలీస్ నిఘా) : మండలోని తోపనగడ్డ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ మాజీ వార్డ్ మెంబర్ మాలోతు శ్రీను, రామోజీ తల్లి ఇటీవల మృతి చెందగా మాలోత్ ఆగమ్మ గారి చిత్ర పటా నికి నివాళ్లులు అర్పించి వారి కుటుంబ సభ్యు లను పరామర్శించిన నర్సంపేట మాజీ శాసన సభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి తోపనగ డ్డ గ్రామా నికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయ కులు సభా వాత్ భాస్కర్ గారి తల్లి సభావాత్ సుగనమ్మ గారి చిత్ర పటానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యు లను పరామ ర్శించిన నర్సం పేట మాజీ శాసనస భ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఈకార్య క్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బాల్నే వెంక న్న . మం డల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ యాదవ్ . లింగగిరి సర్పంచ్ మెడ బోయిన రజిత కుమార స్వామి. మాజీ ఎంపిటి సి పర కాల రాజన్న. తోపనగడ్డ గ్రామ పార్టీ అధ్యక్షులు ఈర్య. నాయకులు రమేష్.వార్డ్ మెంబర్లు మాలోత్ బాలు బాదా వత్ ఈర్య మాలోత్ పవన్.బాలు. సాగర్. ప్రసాద్.గ్రామ నాయ కులు .యూత్ నాయ కులు. సర్పంచు లు. వార్డు మెంబర్లు. పార్టీ నాయకులు. కార్యక ర్తలు.తదితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్లు సమాజానికి పునాది

### -అసెంబ్లీలో బీర్ల అయిలయ్య-



యాదగిరిగుట్ట, మార్చి 26 (పోలీస్ నిఘా) : అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు సమాజానికి బలమైన పునాది వేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన అంగన్వాడీ సిబ్బంది సమస్యలను ప్రస్తావించారు.అంగన్వాడీ విభాగంలో సుమారు 70 వేల మంది సిబ్బంది గత 40–50 ఏళ్లుగా సేవలందిస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల భవిష్యత్ నిర్మాణంలో, పోషకాహారం అందించడం, గర్భిణీల సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.తెలంగాణ ఏర్పాటుకు తర్వాత తమ జీవన స్థితి మెరుగవుతుందని ఆశించినప్పటికీ, పని భారం పెరిగినా వేతనాల్లో పెరుగుదల లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీ సిబ్బంది సమ్మె కూడా నిర్వహించారని గుర్తు చేశారు.మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రకారం నెలకు రు.18,000 వేతనం ఇవ్వాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే రిటైర్మెంట్ తర్వాత పెన్షన్ సదుపాయం కల్పించి, అంగన్వాడీ సిబ్బంది సేవలకు తగిన గౌరవం, భద్రత, సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## పేదోడి ఆరోగ్య, ఆర్థిక సమస్యలకు భరోసా సీఎం రిలీఫ్ ఫండ్



బైరెడ్డి సందీప్ రెడ్డి గౌరవ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారి ద్వారా మంజూరైన 250000 లక్షల రూపాయల విలువగల LOC చెక్కును బాధితుడు అడ్డగూడూర్ పట్టణానికి తుప్పతి లక్ష్మయ్య కుమారుడు మహేష్ కు అందజేత

అడ్డగూడూరు, మార్చి 26 (పోలీస్ నిఘా) : పేదోడికి సీఎం సహాయనిధి ఆరోగ్య, ఆర్థిక భరోసా కల్పిస్తుందని అడ్డగూడూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బైరెడ్డి సందీప్ రెడ్డి అన్నారు అడ్డగూడూర్ పట్టణ కేంద్రంనికి చెందిన తుప్పతి లక్ష్మయ్య కొద్దిరోజుల క్రితం అనారోగ్యానికి గురై హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు ఈ విషయం బైరెడ్డి సందీప్ రెడ్డి తెలుసుకొని గౌరవ తెలంగాణ రోడ్డు రవాణా శాఖ మాత్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారి ద్వారా 250000 లక్షల రూపాయల LOC చెక్కును మంజూరు చేయించారు. ఈ సందర్భంగా బైరెడ్డి సందీప్ రెడ్డి మాట్లాడుతూ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు CMRF ఆర్థిక భరోసా కల్పిస్తుంది అని ఈ పథకం కోసం కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుంది అన్నారు. గౌరవ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు.

## బాలల పరిరక్షణ అవగాహన సదస్సు కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు



మధిర, మార్చి 26 (పోలీస్ నిఘా) : దెందుకూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన బాలల, పరిరక్షణ అవగాహ కార్యక్రమం గ్రామ సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావుగారి అధ్యక్షత ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ రాయల ఝాన్సీ వరలక్ష్మి ప్రసాద్ గ్రామ కార్యదర్శి భాస్కర్, పీహెచ్సీ వైద్యులు పృథ్వి నాయక్ హెల్త్ సూపర్వైజర్ లంకా కొండయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజకుమారి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు డిశ్యామలరావు అంగన్వాడి సూపర్వైజర్ సుజాత మరియు పీహెచ్సీ సిబ్బంది అంగన్వాడి టీచర్లు ఆశా కార్యకర్తలు గ్రామ దీపికలు విద్యార్థిని విద్యార్థులు గ్రామ ప్రజలు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# పన్నులు కడితే ఫలితం విషజ్వరాలా?

**సిరిసిల్లలో మురికి కాలువలతో ప్రజల ఆవేదన**

**కాలువలు శుభ్రం చేయక దోమల పెరుగుదల**

**డెంగ్యూ, మలేరియా భయం అధికారుల నిర్లక్ష్యంపై వార్డుల ప్రజల ఆగ్రహం**



రాజన్న సిరిసిల్ల, మార్చి 26 (పోలీస్ నిఘా) : సిరిసిల్ల పట్టణంలోని అశోక్ నగర్, పద్మ నగర్,వెంకంపేట,అంబిక నగర్ ప్రాంతాల ప్రజలు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతాల మీదుగా కొత్త చెరువుకు వెళ్లే మురికి కాలువలు గత కొన్ని సంవత్సరాలుగా శుభ్రం చేయకపోవడంతో పూర్తిగా పూడికతో నిండిపోయాయి. కాలువలో పిచ్చి మొక్కలు పెరిగి, ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలతో నిండిపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీనితో దోమలు విపరీతంగా పెరిగి, ప్రజలు డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాల బారిన పడుతున్నారు. ఆస్పత్రుల పాలవుతూ అప్పుల పాలవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యకు ప్రధాన కారణం పద్మా నగర్ వద్ద కొత్త చెరువుకు వెళ్లే మార్గంలో నిర్మించిన ఫిల్టర్ బెడ్ అని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీని వల్ల నీరు సాఫీగా వెళ్లక కాలువలో నిల్వవుతూ దుర్వాసనకు కారణమవుతోంది. గతంలో ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, ఆయన స్వయంగా సందర్శించి ఫిల్టర్ బెడ్‌ను తొలగించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించినప్పటికీ, ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. మార్చి నెల వచ్చిందంటే పన్నులు వసూలు చేసే మున్సిపల్ అధికారులు, ఈ కాలువలలో పేరుకుపోయిన చెత్త ఎందుకు కనిపించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి, కాలువలను పూర్తిగా శుభ్రపరచి, అడ్డుగా ఉన్న ఫిల్టర్ బెడ్‌ను తొలగించి శాశ్వత పరిష్కారం కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే దోమల నివారణకు తక్షణ చర్యలు తీసుకొని మందు పిచికారీ చేయాలని కోరుతున్నారు.

# పండుగలను ప్రశాంతంగా జరుపుకుందాం



రంగారెడ్డి, మార్చి 26 (పోలీస్ నిఘా) : గౌరవనీయులైన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ శ్రీ జి. సుధీర్ బాబు, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, రాబోయే శ్రీరామనవమి మరియు హనుమాన్ జయంతి పండుగల సందర్భంగా, ఈరోజు కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో శాంతి సమావేశాలు నిర్వహించబడ్డాయి. ఆమనగల్ మరియు మహేశ్వరం పోలీస్ స్టేషన్లలో, ఎస్‌హెచ్‌ఓలు వెంకటేశ్ మరియు వెంకటేశ్వర్లు గారి ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు మరియు కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి, శాంతి భద్రతలపై చర్చించారు. పండుగలను అందరూ కలిసి మెలసి, ఎలాంటి వివాదాలు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని పోలీస్ అధికారులు సూచించారు. శోభాయాత్రలు, ర్యాలీలు నిర్వహించాలంటే ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలి. ఊరేగింపులు అనుమతి ఇచ్చిన మార్గాల్లోనే, చెప్పిన సమయానికి పూర్తి చేయాలి. ఇతర మతాల మనోభావాలను దెబ్బతీసే మాటలు, నినాదాలు చేయకూడదు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, తప్పుడు వార్తలు నమ్మకండి, షేర్ చేయకండి. ర్యాలీ సమయంలో సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి. ప్రభుత్వ ఆస్తులను పాడు చేయ కూడదు. రోడ్డుపై ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా చూడాలి. ఏదైనా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఈ సందర్భంగా, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని కమిటీ సభ్యులందరూ హామీ ఇచ్చారు.

### అమరజీవి ధర్మబిక్షం జీవితం అంతా

# పేదల హక్కుల కోసం పోరాటం



యాదగిరిగుట్ట, మార్చి 26 (పోలీస్ నిఘా) : యాదగిరిగుట్ట స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, మాజీ పార్లమెంట్ సభ్యులు గీతా పని వారిలా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు అమరజీవి బొమ్మగాని ధర్మబిక్షం 15వ వర్ధంతి పట్టణంలో గుండ్లపల్లి గౌడ సొసైటీలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమరజీవి బొమ్మగాని ధర్మ బిక్షం తన జీవితం అంతా పేద ప్రజల హక్కుల కోసం వారి బాగుకోసం పోరాటం చేశారన్నారు. నిస్వార్థ జీవితంతో నిత్యం పేద ప్రజలకు వారి హక్కుల కోసం కృషి చేశారని మూడు సార్లు ఎమ్మెల్యేగా రెండుసార్లు పార్లమెంటు సభ్యులుగా పనిచేశారని అన్నారు.గీత వృత్తి లో ఉన్న కష్టాలను చూసి వారికోసం గీతా పనివాళుల సంఘం ఏర్పాటు చేసి అనేక పోరాటాలు చేసి గీతా కార్మికులకు పెన్షన్, తాడిచెట్టు పై నుండి కింద పడిన వరకి ప్రభుత్వం ఎక్సిగ్రేషియా చెల్లించడం, తాడిచెట్లు పెంచుకోవడానికి ప్రభుత్వం భూమిని ఇప్పించే విధంగా హక్కులను కల్పించిన గొప్ప నాయకుడు అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు కళ్యాం కృష్ణ, యువజన సమైక్య జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, యాదగిరిగుట్ట మున్సిపల్ కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్, కో ఆప్షన్ సభ్యులు మాజీ పేరబోయిన పెంటయ్య, సిపిఐ మండల కార్యదర్శి కల్లపేల్లి మహేందర్, గీతా పనివర్ల సంఘం నాయకులు గుండు వెంకటేష్, మాటూరు మల్లయ్య, గుండ్లపల్లి గౌడ సంఘం సభ్యులు ఎరుకల హేమేంధర్, దుశెట్టి చంద్రయ్య, కీసర బాలరాజు, సిపిఐ నాయకులు పేరబోయిన బంగారి, గోపగాని రాజు, గౌడ సంఘం నాయకులు గుండ్లపల్లి లింగం, అరె శ్రీధర్, పచ్చిమట్ల నరేష్, ఆరె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శంకర్ పల్లి మున్సిపాలిటీని సందర్శించిన అదనపు కలెక్టర్ కే.శ్రీనివాస్

**ఇంటి పన్నులు 100% వసూలు చెయ్యాలి అని సూచన**

శంకర్‌పల్లి, మార్చి 26 (పోలీస్ నిఘా) : గురువారం అనగా 26.03.2026 రోజున పురపాలక సంఘం శంకర్పల్లికి అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ రంగారెడ్డి జిల్లా కే.శ్రీనివాస్ సందర్శించడం జరిగింది. మొదటగా పట్టణ పరిధిలోని డి ఆర్ సీ సీ సెంటర్ విజిట్ చేయడం జరిగింది, జంక్షన్ డెవలప్మెంట్ మరియు రోడ్ అండర్ బ్రిడ్జ్ వద్ద జరుగుతున్న పెయింటింగ్ పనులను పరిశీలించడం జరిగింది, 2బి కే వద్దకు వెళ్ళి పర్యవేక్షించడం జరిగింది. మున్సిపల్ కార్యాలయమునకు వచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిన మొత్తం జూన్ 12 వరకు పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశించినారు. తదుపరి బిల్ కలెక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి ఇంటి పన్నులు 100% వసూలు చేయాలని లేనియెడల చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపినారు. పట్టణ ప్రజలు సకాలంలో ఇంటి పనులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ యోగేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.




## ఉక్కపోతకు గురవుతున్న అంగన్ వాడి చిన్నారులు

**అంగన్‌వాడీ చిన్నారులకు ఒంటిపూట బడులు పెట్టాలి**

**అంగన్వాడీ కేంద్రాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలి**

**మద్దాల ప్రభాకరరావు సీఐటీయూ జిల్లా నాయకులు**



మధిర, మార్చి 26 (పోలీస్ నిఘా) : ఎండల తీవ్రత దృష్ట్యా పాఠశాలల్లో ఒంటిపూట బడులు ప్రభుత్వం నిర్వహిస్తుంది. కాని అంగన్ వాడి కేంద్రాల్లో ఉండేది అసలే చిన్న పిల్లలు వేసవి ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్నాయి ఎండ తీవ్రత ఉక్కబోత తో అద్దె భవనాల్లో చిన్నచిన్న అంగన్వాడి కేంద్రాలలో ఉండే చిన్న గదుల్లో ఆడుకోవడం, పడుకోవడం చిన్నారులు మరింత అవస్థ పడుతూ సాయంత్రం నాలుగు గంటల వరకు వేడికి తట్టుకోలేక చిన్నారులు అంగన్ వాడి కేంద్రాలలో ఉండలేకపోతున్నారు. ఆ సమయంలో కనీసం ఆ కేంద్రాల్లో చల్లని తాగనీరు కూడా లేకపోవడంతో వేడి నీళ్లు తాగలేక దాహుర్తితో చిన్నారులు ఇబ్బంది పడుతున్నారని ప్రతి ఒక్క అంగన్వాడి కేంద్రానికి వాటర్ ఫిల్టర్ ఏర్పాటు, మౌలిక సదుపాయాలు కల్పించాలని.ఎండ ప్రభావ,అధిక ఉష్ణోగ్రత తీవ్రత అధికంగా ఉండడంతో పిల్లలు ఉక్కపోతకు గురవుతున్నారని. కావున చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యాశాఖ, ఉన్నత అధికారులు,ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లో కూడా ఒంటిపూట బడి విధానం వెంటనే అమలు చేయాలనీ సిఐటియు జిల్లా నాయకులు మద్దాల ప్రభాకరరావు డిమాండ్ చేశారు.

## గాంధీ ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి చికిత్స



హైదరాబాద్, మార్చి 26 (పోలీస్ నిఘా) : గాంధీ ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి చికిత్స విజయవంతంగా జరిగింది. అడ్డగుట్ట హైదరాబాద్ కు చెందిన పి సాయి మోహన్ 22 సంవత్సరాల వ్యక్తి గత ఎనిమిది నెలలుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. పలు ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స చేయించుకున్నాడు. గత కొన్ని నెలలుగా డయాలసిస్ అవసరం కూడా వచ్చింది. అతనికి అన్ని పరీక్షలు గాంధీ ఆసుపత్రి నెఫ్రాలజీ విభాగం వైద్యులు చేయించి కిడ్నీ మార్పిడి చికిత్స అవసరాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలిపారు. పి సాయి మోహన్ తండ్రి పీ నరసింహారావు గారు కిడ్నీ డొనేట్ చేయడానికి ముందుకు వచ్చారు వారికి అవసరమైన అన్ని పరీక్షలు ఆరోగ్యశ్రీ పథకంలో గాంధీ ఆసుపత్రిలో చేయించి కిడ్నీ మార్పిడి చికిత్స విజయవంతంగా 17-3 2026 నాడు చేయడం జరిగింది. ప్రస్తుతం ఈ సాయి మోహన్ ఆరోగ్యంగా ఉన్నాడు కిడ్నీ పనితనం మెరుగ్గా ఉంది, డయాలసిస్ అవసరం లేకుండా సాధారణ జీవితం గడుపుతున్నాడు. కిడ్నీ డొనేట్ చేసిన సాయి మోహన్ తండ్రి పి నరసింహారావు కూడా ఆరోగ్యంగా ఉన్నారు. ఈ కిడ్నీ మార్పిడి విజయవంతంగా జరపడంలో నెఫ్రాలజీ విభాగం వైద్యులు డాక్టర్ మంజూష యాడ్ల, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ శ్రీనివాస్, పి జి వైద్యులు మరియు యూరాలజీ విభాగం డాక్టర్ రవిచంద్ర, డాక్టర్ వినయ్ మరియు వారి టీం ముఖ్యపాత్ర పోషించారు. అనస్థీషియా విభాగం డాక్టర్ మురళీధర్, డాక్టర్ చంద్రావతి మరియు వారి టీం పాల్గొన్నారు. ఆస్పత్రి సూపర్డెంట్ డాక్టర్ శోభ గారు, డిప్యూటీ సూపర్డెంట్ మరియు ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ కే సునీల్ కుమార్ గారు సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ శేషాద్రి గారు మరియు వారి టీం ప్రత్యేక శ్రద్ధతో పూర్తి ప్రక్రియ విజయవంతంగా జరగడానికి కృషి చేశారు.

## సంగెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన వరంగల్ సిపి

**న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని బాధితుల్లో కలిగించాలి: సిపి**



వరంగల్, మార్చి 26 (పోలీస్ నిఘా) : వరంగల్ పోలీస్ కమిషనర్ శ్రీ సన్ ప్రీత్ సింగ్ గురువారం సంగెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు సంగెం అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలకగా, ముందుగా సీపీ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, స్టేషన్ ఆవరణలో మామిడి మొక్కను నాటారు అనంతరం సీపీ పోలీస్ స్టేషన్‌ను సమగ్రంగా పరిశీలించిన కమిషనర్, స్టేషన్ పరిధిలోని గ్రామాలు, ప్రజల జీవన విధానం, స్థానికంగా జరుగుతున్న నేరాలు, రౌడీ షీటర్లు, అనుమానితులపై వివరాలను ఇన్స్‌పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే పోలీస్ సిబ్బంది పనితీరు, బీట్ వ్యవస్థ, పెట్రోలింగ్, రికార్డుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. అనంతరం స్టేషన్‌లో నమోదు అయిన కేసులు, పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టుకు సంబంధించిన అంశాలపై రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడికి న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగేలా పనిచేయాలని సూచించారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, విధి నిర్వహణలో అలసత్వం లేకుండా, పారదర్శకంగా సేవలు అందించాలని తెలిపారు. ప్రజల విశ్వాసం పొందే విధంగా పోలీసులు తమ విధులను నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామూనూర్ ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సిఐ రాజగోపాల్, సంగెం ఎస్. ఎస్. ఐ వంశీ కృష్ణతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వం మొక్కజొన్నలు కొనుగోలు చేయాలి

## సిపిఎం నాయకులు పోతినేని సుదర్శన్ డిమాండ్



బోనకల్, మార్చి 26 (పోలీస్ నిఘా) : అన్నదాతలు రక్తాన్ని శ్రమగా మార్చి పంటలు పండిస్తున్నారని, వెంటనే మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, మొక్కజొన్న కొనుగోలుపై పరిమితిని వెంటనే ఎత్తివేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం లోని బోనకల్ మండల కేంద్రంలో సీపీఐ(ఎం), తెలంగాణ రైతు సంఘం మండల కమిటీల ఆధ్వర్యంలో రైతు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు రెండు గంటలపాట ఆందోళన నిర్వహించారు. తొలుత స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి ప్రదర్శనగా బోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయం, స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్ మీదుగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడే రెండు గంటలపాటు ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినత పత్రాన్ని తహశీల్దార్ మద్దెల రమాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఈ సందర్భంగా పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్నకు రూ. 330, పత్తికి రూ. 800 బోనస్ ప్రకటించిన అన్నారు. తెలంగాణ రాష్ట్రం వ్యాప్తంగా 10 లక్షల ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేస్తే కేవలం ఖమ్మం జిల్లాలోని లక్ష ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశారన్నారు. ఎకరానికి 25 క్వింటాలు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వాలు ప్రకటించడం దారుణమన్నారు. ఎకరానికి సుమారు 40 క్వింటాలు దిగుబడి వస్తుందని, మిగిలిన మొక్కజొన్న పంటను ఎవరు కొనుగోలు చేయాలని ఆయన ప్రశ్నించారు. నేడు మొక్కజొన్న రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర రూ. 2400 రూపాయల ప్రకటించిందని, కానీ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో దళారులు గ్రామాలలోకి రంగ ప్రవేశం చేసి క్వింటా కేవలం రూ. 1600 రూపాయలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ ఏడాది అకాల వర్షాలు వలన పత్తి, మొక్కజొన్న పంట రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. నష్టపోయిన మొక్కజొన్న రైతులకు వెంటనే పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కోతుల నుంచి మొక్కజొన్న పంటను కాపాడుకోవడానికి అన్నదాతలు అనేక కష్టాలు పడ్డారన్నారు.

# ముషీరాబాద్‌లో కల్తీ మరియు గడువు ముగిసిన

# ఐస్ క్రీం తయారీ కేంద్రంపై టాస్క్ ఫోర్స్ దాడులు

## ఒకరి అరెస్ట్



హైదరాబాద్, మార్చి 26 (పోలీస్ నిఘా) : నమ్మదగిన సమాచారం మేరకు, హైదరాబాద్ సిటీ కమిషనర్స్ టాస్క్ ఫోర్స్ (ఖైరతాబాద్ మరియు సికింద్రాబాద్ జోన్ బృందాలు) హెచ్-ఫాస్ట్ టీమ్ మరియు జిహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ (సర్కిల్ నం. 40) బి. సాహితీ గారితో కలిసి సంయుక్తంగా ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాపూజీ నగర్‌లో ఉన్న 'బ్లూ బెల్స్ ఐస్ క్రీం' తయారీ కేంద్రంపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎటువంటి చెల్లుబాటు అయ్యే లైసెన్స్ లేకుండా, అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో, గడువు ముగిసిన ముడి పదార్థాలతో ఐస్ క్రీంలు తయారు చేస్తున్న పట్టాల అశోక్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

తనిఖీ వివరాలు: నిందితుడు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున కల్తీ ఐస్ క్రీం ఉత్పత్తులను తయారు చేస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. నాణ్యమైన ఐస్ క్రీంలని నమ్మబలుకుతూ హోల్ సేల్ మరియు రిటైల్ కస్టమర్లకు సరఫరా చేస్తూ అక్రమ లాభాలు గడిస్తున్నాడు. తయారీలో గడువు ముగిసిన రంగులు, ఫ్లేవర్లను ఉపయోగిస్తూ వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నట్లు గుర్తించారు. అలాగే తయారీ కేంద్రం మరియు ముడి పదార్థాల నిల్వ ప్రాంతం అత్యంత అపరిశుభ్రంగా, మానవ వినియోగానికి ఏమాత్రం పనికిరాని విధంగా ఉన్నట్లు పోలీసులు గమనించారు.

సీజ్ చేసిన వస్తువుల వివరాలు: ఈ దాడుల్లో పోలీసులు మొత్తం రూ. 1,75,000/- విలువైన 3,759 వివిధ రకాల ఐస్ క్రీం ఉత్పత్తులను (సుమారు 1,252 లీటర్లు) స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 4 లీటర్ల ప్యాకింగ్‌లో ఉన్న 400 లీటర్ల వెనీలా, 320 లీటర్ల బటర్ స్కాచ్, 120 లీటర్ల అమెరికన్ నట్స్, 120 లీటర్ల స్ట్రాబెర్రీ, 80 లీటర్ల డ్రై ఫ్రూట్, 60 లీటర్ల మాంగో మరియు 20 లీటర్ల క్రీమ్ ఌ కుకీస్ ఐస్ క్రీంలు ఉన్నాయి. అలాగే విక్రయానికి సిద్ధంగా ఉన్న 2,550 పెప్సీ ఐస్ క్రీం ప్యాకెట్లు, 1 లీటర్ ప్యాకింగ్‌లో ఉన్న 38 లీటర్ల స్పెషల్ ఫ్లేవర్ మరియు 24 లీటర్ల స్ట్రాబెర్రీ ఐస్ క్రీంలను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు అర లీటర్ ప్యాకింగ్‌లో ఉన్న 20 లీటర్ల స్పెషల్ ఫ్లేవర్ మరియు 10 లీటర్ల స్ట్రాబెర్రీ ఐస్ క్రీంలు, మరియు 50 ఎంఎల్ పరిమాణంలో ఉన్న 800 మలై కుల్ఫీ ఐస్ క్రీంలను (40 లీటర్లు) సీజ్ చేశారు. ముఖ్యంగా, తయారీలో వాడుతున్న కృత్రిమ ఆహార రంగులు (180 గ్రాముల ప్యాకెట్లు), టాక్సిక్ సింథటిక్ ఫుడ్ కలర్ తో పాటు, గడువు ముగిసిన పైనాపిల్, మాంగో మరియు సీతాఫల్ ఫ్లేవర్ బాటిళ్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

చర్యలు: పట్టుబడిన నిందితుడిని మరియు సీజ్ చేసిన సామగ్రిని తదుపరి చర్యల నిమిత్తం ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ గారికి అప్పగించారు. ముషీరాబాద్ పోలీసులు క్రైమ్ నం. 118/2026, U/Sec. 125, 318(4) BNS కింద కేసు నమోదు చేశారు. ఈ ఆపరేషన్‌లో ఖైరతాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ పి. రాఘవేందర్, సికింద్రాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ జె. రాజశేఖర్, ఎస్.ఐ. కృష్ణ, టాస్క్ ఫోర్స్ సిబ్బంది మరియు హెచ్-ఫాస్ట్ టీమ్ పాల్గొన్నారు. వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఐపిఎస్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు, కమిషనర్స్ టాస్క్ ఫోర్స్, హైదరాబాద్ సిటీ.

# దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ భూసేకరణ పై సమీక్ష

## భూ సేకరణలో సమస్యలు ఎదురైతే తక్షణం పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్



వరంగల్, మార్చి 26 (పోలీస్ నిఘా) : దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ భూసేకరణ పురోగతిపై సమీక్ష దేవాదుల జె. చొక్కారావు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పురోగతిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని నర్సంపేట, దుగ్గొండి, రాయపర్తి, వర్ధన్నపేట, నల్లబెల్లి మండలాల్లో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్ట్ పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి, ముందస్తు నివేదికలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రాజెక్ట్ అమలు సజావుగా కొనసాగేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, పారదర్శకంగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంధ్యారాణి, ఆర్డీఓలు సుమ, ఉమారాణి, సంబంధిత మండలాల తహసీల్దార్లు, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి దినోత్సవాలు

## ఉప్పరపల్లి హైస్కూల్లో రీడింగ్ రూమ్ ప్రారంభం

**యువత రీడింగ్ రూమ్‌లను ఉపయోగించుకు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి: వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**నర్సంపేట నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠ శాలలకు 200 కంప్యూటర్లను అందజేస్తాం: మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్**




చెన్నారావుపేట , మార్చి 26 (పోలీస్ నిఘా) : ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భా గంగా తెలంగాణ ప్రభు త్వం గ్రామ పట్టణ స్థాయి లో ప్రజలకు విద్యా అవగాహన పెంపొందించేందుకు రీడింగ్ రూమ్ కార్యక లాపాలను ప్రారంభించింది. ఈ సందర్భంగా చెన్నారావుపేట మండ లంలోని ఉప్ప రపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పౌర పఠనా లయం (రీడింగ్ రూమ్) ప్రారంభోత్సవం పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు జయ స్థానిక సర్పంచ్ చిలక అనిత ఆధ్వర్యంలో జరిగింది ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా వరంగ ల్ జిల్లా కలెక్టర్ సత్య శారద హాజరైనారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడు తూ పఠన కార్యక్రమాల ద్వారా విద్యార్థులు, యువత సాధారణ ప్రజలకు పుస్తకాలు, వార్తాప త్రికలు, పోటీ పరీక్షల మెటీరియల్ అందుబా టులో ఉంచ డం జరుగు తుం దని, అలాగే కెరీర్ గైడెన్స్, గ్రూప్ డిస్క షన్స్, క్విజ్ పోటీలు నిర్వ హించి వారి ప్రతిభను వెలికి తీసే ప్రయత్నం చేస్తా మని తెలిపారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, చదువు అలవాటు పెంపొం దించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, గ్రామ పంచాయతీ భవనాలు, పాఠశాలలు, కమ్యూ నిటీ హాల్స్‌లో ఈ రీడింగ్ రూమ్స్ నిర్వహిం చబ డుతున్నవని తెలిపారు. ఉప్పరప ల్లి పాఠశాల విద్యార్థు లను ఉద్దేశించి వివిధ విషయాలపై మాట్లాడారు. విద్య యొక్క ఆవశ్య కతను, భవిష్య త్తులో సమాజా నికి ఉపయో గపడే వ్యక్తిగా మెలగాల్సిన తీరును ప్రశ్నల ద్వారా రాబట్టా రు. ఉప్పరపల్లి ఉన్నత పాఠశాల అన్ని రంగాలలో ముందం జలో ఉండడా న్ని ప్రశం సిం చారు. ప్రధానో పాధ్యా యురాలు ఉపా ధ్యా యుల కృషిని అభినందించారు.



క్రాఫ్ట్ టీచర్ ఇందిరా ఆధ్వ ర్యంలో విద్యార్థు లు తయారు చేసిన వివిధ రకాల వస్తువుల ను , బొమ్మలను సంద ర్శించి అభినం దించారు. విద్యా ర్థుల చేత లైబ్రరీ పుస్తకాలను చదివించారు. వరంగల్ జిల్లా అడిష నల్ కలెక్టర్ సంధ్యారాణి మాట్లా డుతూ ప్రజలు, ము ఖ్యంగా విద్యార్థులు మరియు యువత పెద్ద ఎత్తున వినియోగించుకోవాలని , ప్రపంచ విషయాలు పుస్తకాలు పేపర్ల ద్వారా తెలుసు కోవచ్చని, గ్రంథాల యాలు ఆధుని క దేవాలయాలని గ్రామ ప్రజలంతా రీడింగ్ రూమ్ ఉపయోగిం చుకోవాలనికోరారు నర్సంపేట వ్యవసాయ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీని వాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం విద్యాభి వృద్ధికి వేల కోట్ల నిధులు ఖర్చు చేస్తుం దని, విద్యాభి వృద్ధికి చిత్త శుద్ధితో కట్టుబడి ఉంద న్నా రు. నర్సంపేట నియోజ కవర్గం లోని ప్రభుత్వ పాఠశాలలకు 60 కంప్యూటర్లను ఎమ్మె ల్యే దొంతి మాధ వరెడ్డి ఆధ్వ ర్యంలో పం పిణీ చేశామని, వచ్చే విద్యా సంస్థలు 200 కంప్యూటర్లను పంపిణీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా డిఈఓ రంగయ్య నాయుడు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో లైబ్రరీ పీరియడ్ ను కచ్చితంగా నిర్వహించాలని, విద్యార్థులలో పఠన సామర్థ్యాన్ని పెంపొం దించాలని కోరారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా గ్రంధా లయ కార్యదర్శి అలివేలు, డిఎంహెచ్ఓ సాంబ శివరావు, మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ బాలకృష్ణ, తహసిల్దార్ మమ్మద్ దిలావర్ అబిద్ అలీ, ఎంపీడీవో అయేషా పర్వీన్, ఎంఈఓ పాపమ్మ , ఉప సర్పంచ్ అన్వేష్ , వార్డ్ మెంబర్లు యువజన సంఘాల సభ్యులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. రీడింగ్ రూమ్ వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ విశేషంగా ఆకట్టుకుంది. వరంగల్ జిల్లా కలెక్టర్ తో సహా అధికారులు సెల్ఫీ పాయింట్ వద్ద ఫోటోలు దిగారు.

# పశ్నించే గొంతుకలపై ఎమ్మెల్యే భారీ కుట్ర



**ఆడపిల్లకు అన్యాయం...**
**అడిగితే అక్రమ కేసులా?**
**బేషరతుగా నాయకులను విడుదల చేయాలని డిమాండ్**
**రాజకీయ,విద్యార్థి,మహిళా, ప్రజా సంఘాల మద్దతు**
**టిఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్**

వనపర్తి, మార్చి 26 (పోలీస్ నిఘా) : సోమవారం అక్షర స్కూల్ లో మైనారిటీ బాలికపై జరిగిన అత్యాచారాన్ని ప్రశ్నించడానికి వెళ్ళిన నాయకులు నందిమల్ల.అశోక్, చీర్ల.చందర్,మెకానిక్.శ్రీను మరో 6మందిపై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ పోలీస్ స్టేషన్ ముందు మెరుపు ధర్నా నిర్వహించారు. బి.ఆర్.ఎస్ నాయకులు గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్ పలుస రమేష్ గౌడ్ ఆధ్వర్యములో అక్రమంగా అరెస్టు చేసిన నాయకుల్ని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆడపిల్లపై అత్యాచారం చేసిన నిందితున్ని యాజమాన్యాన్ని కాపాడాలని ఎం.ఎల్.ఏ చేసిన భారీ కుట్రలో బాగంగా నాయకులను అరెస్ట్ చేశారని వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వపరంగా బాధిత బాలికకు,కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షములో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమంచేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రాజశేఖర్ గౌడ్, పెద్దిరాజు, కాగితాల లక్ష్మీనారాయణ, ఉ ఒగ్గం తిరుమల్ మున్సిపల్ కౌన్సిలర్లు మురళి సాగర్ శ్రీకర్ గౌడ్ చింటూ సమద్ స్టార్ రహీం, హేమంత్ ముదిరాజ్, జోహార్ హుస్సేన్, సూర్యవంశం గిరి, యుగంధర్ రెడ్డి, చిట్యాల రాము,సి.పి.ఎం నాయకులు పరమేశ్వరా చారి , సి.పి. ఐ నాయకులు గోపాల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

## రూ. లక్ష జరిమానా విధించిన కోర్ట్

### జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు




మెదక్, మార్చి 26 (పోలీస్ నిఘా) : మెదక్ మహిళలు, చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. తుప్రాన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో నిందితుడిని కోర్టు దోషిగా తేల్చి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించినట్లు వెల్లడించారు. తుప్రాన్ పీఎస్ పరిధిలోని జండపల్లి గ్రామానికి చెందిన సోమగారి భాస్కర్ (27) బాలికపై లైంగిక దాడి పలుపడినట్లు ఫిర్యాదు అందడంతో అప్పటి ఎస్ఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి దర్యాప్తు అధికారి సీఐ శ్రీధర్ సమగ్రంగా విచారణ జరిపి సాక్ష్యాధారాలను సేకరించి, పక్క ఆధారాలతో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన మెదక్ ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావల్లి నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 1 లక్ష జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు, జరిమానా మొత్తాన్ని బాధితురాలికి పరిహారంగా చెల్లించాలని కోర్టు ఆదేశించిదని తెలిపారు. కేసు విజయవంతంగా నడిపించడంలో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. బాలయ్య, భారోసా లీగల్ ఆఫీసర్ అడ్వకేట్ కే. స్వేత కీలక పాత్ర పోషించారు. తూప్రాన్ ఎసై గంగరాజు, జిల్లా లైజనింగ్ ఆఫీసర్ బి. విఠల్, పీసీలు జి. కృష్ణ, సీడిఓ నాగరాజు తదితరులు సమన్వయం చేశారు. ఇలాంటి కేసుల్లో వేగంగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

# ఆఫీస్ సూపరిండెంట్ అనిల్ కుమార్‌కు వినతి పత్రం అందజేసిన రామ రాజేష్ ఖన్నా

## ఆరు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి



వరంగల్ , మార్చి 26 (పోలీస్ నిఘా) : వరంగల్ జిల్లా డీఎం అండ్ హెచ్ ఓ కార్యాలయంలో ఆఫీస్ సూపరిండెంట్ అనిల్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, గత సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఆరు నెలల జీతాలు అందకపోవడంతో ఉద్యోగులు పరిస్థితి దయానీయంగా మారిందని ఇంటి కిరాయిలు, పిల్లల బడి ఫీజులు, ఈ.ఎం.ఐ.లు, కుటుంబ పోషణ కష్టంగా మారిందని ప్రభుత్వ వెంటనే వేతనాలు విడుదల చేయాలని, ప్రతి నెలా 5 వ తేదీ లోపు ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను యధావిధిగా కాంట్రాక్ట్ లో కొనసాగించాలని , ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని లేదా ప్రభుత్వమే నేరుగా ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని, మహిళ ఉద్యోగులకు వేతనంతో ప్రసూతి సెలవులు 180 రోజులు మంజూరి చేయాలని, పై సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేదంటే ఈ నెల 29 మార్చి 2026 ఆదివారం రోజున హైదరాబాద్ ఇందిరా పార్కు లో మహాధర్నా చేస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అజ్మీర్ విజయ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఖాతాదారులకు ప్రమాద భీమా రూ. 1,00,000/- అందజేత



దేవరకొండ, మార్చి 26 (పోలీస్ నిఘా) : దేవరకొండ వాసి షబ్బీర్ హుసేన్ కుమారుడు జుబేరా హుసేన్ 09.09.2024 రోజు అక్కంపల్లి రిజర్వాయరులో చాపల వేటకు వెళ్లి ప్రమాద వషాత్తు కాలుజారి నీళ్లలో పడి మరణించినాడు. అతనికి పై బ్యాంకు నందు ఖాతా ఉండి ప్రతి సంవత్సరం రూ. 40 న్యూ ఇండియా ఇన్సూరెన్స్ జమచేయడం వల్ల ప్రమాద భీమా క్రింద న్యూ ఇండియా ఇన్సూరెన్స్ వారు రూ.1,00,000/- మంజూరు చేసినారు అట్టి రూపాయల సర్టిఫికెట్ మా బ్యాంకు సీనియర్ ఖాతాదారు, బ్యాంకు శ్రేయోభిలాషి,దేవరకొండ ప్రభుత్వ పెన్షనర్స్ సేవ సంఘం ప్రధాన కార్యదర్శి అంకం చంద్రమౌళి గారి చేతుల ద్వార అందజేయడం జరిగింది అని బ్యాంకు మేనేజర్ పాత్రునాయక్ తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ కుంభం శేఖర్ సిబ్బంది పాలుగొన్నారు.

## ఆదుకుంటున్న ఆపన్న హస్తాలు



దేవరకొండ , మార్చి 26 (పోలీస్ నిఘా) : నేరడుగొమ్ము మండల కేంద్రానికి చెందిన బుడిగపాక దశరథం ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోయిన విషయం తెలుసుకొని ఆర్థిక సాయం చేసిన ఎన్నారై నాయిని హర్షవర్ధన్ రెడ్డి. ఈ విషయాన్ని స్థానిక సర్పంచ్ సుధాకర్ ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే స్పందించిన హర్షవర్ధన్ రెడ్డి అండగా ఉండాలని సర్పంచ్ సుధాకర్ కు ఫోన్ పే ద్వారా 7500 పంపారు. ఆ నగదుని బాధిత కుటుంబానికి అందించాలని కోరారు. ఆ నగదుని సర్పంచ్ సుధాకర్ గురువారం బాధిత కుటుంబానికి అందజేశారు. బాధిత కుటుంబాన్ని దాతలు ఎవరైనా తనకు తోచిన ఆర్థిక సహాయాన్ని అందించి ఆ కుటుంబానికి ఎంతో కొంత మేలు చేసిన వారవుతారని అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుధాకర్,ఆరెకంటి గోపాల్, గాదపాక నాగార్జున్,వరికుప్పల సైదయ్య,మస్క యాదయ్య, మద్దిమడుగు ముత్యాలు,శ్రీను నిరసనమెట్ల రవి తదితరులు పాల్గొన్నారు.

## బాలల పరిరక్షణ మనందరి బాధ్యత

### తీదేడు గ్రామంలో 'మిషన్ వాత్సల్య పథకం బాలల చట్టాల'పై అవగాహన కార్యక్రమం

### తీదేడు గ్రామ సర్పంచ్ (బాలల పరిరక్షణ కమిటీ ఛైర్మన్) ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి





దేవరకొండ , మార్చి 26 (పోలీస్ నిఘా) : బాలల పరిరక్షణ మన ందరి బాధ్యతని తీదేడు గ్రామ సర్పంచ్ గ్రామ బాలల పరిరక్షణ కమిటీ ఛైర్మన్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు. గురు వారం గ్రామ పం చాయతీ కార్యాలయంలో జిల్లా బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ...బాల బాలికలను అన్ని రంగాలలో ప్రోత్సహించడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆమె అన్నారు. బాల్య వివాహాలు జరుగకుండా ప్రతి ఒక్కరు చూడాలని ఆమె అన్నారు. బాలలందరు బడికి వెళ్ళేలా,బాల కార్మికులు లేకుండా,బాలలపై ఎలాంటి వేధింపులు జరుగకుండా ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని తెలిపారు. బాలల సంక్షేమ కోసం ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్,మాజీ ఉప సర్పంచ్లు ధరణిపతి రమణారావు, ఉలుపాల శేఖర్ రెడ్డి,సోనగంటి గొవర్ధనాచారి,వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి,మాదగోని కృష్ణ గౌడ్, గంటెల అలివేలు సోమయ్య, దాసరి కళమ్మ ముత్తయ్య, రెడ్డి పద్మ పరమేష్,సందె లక్ష్మయ్య,మర్ల యాదగిరి,ఐ.సి.పి.యస్ సభ్యులు రాము,అంగన్వాడి సూపర్వైజర్ ప్రసన్న లక్ష్మి,అంగన్వాడి టీచర్లు, ఆశావర్కర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలను వేగవంతంగా నడపవద్దు

### మీ యొక్క విలువైన ప్రాణాలను కాపాడు కోండి..

### తప్పనిసరి హెల్మెట్ ధరించాలి: నెక్కొండ సిఐ శ్రీనివాస్




చెన్నారావుపేట, మార్చి 26 (పోలీస్ నిఘా) : వాహనాలు వాహనా వేగవంతంగా నడపవ ద్దు ఒక విలువైన ప్రాణాలను కాపాడు కోండి తప్పనిసరి హెల్మెట్ ధరిం చాలని అని నెక్కొండ సిఐ శ్రీనివాస్ వాహనదా రులకు అవగాహన కల్పించారు చెన్నారావు పేట మండ లం ఖాదర్ పేట శివారులో ప్రమా దక రంగా ఉన్న మూల మలుపు వద్ద పోలీసుల ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. తరచూ ప్రమా దాలు జరుగుతుం డడంతో గుర్తించిన పోలీసులు ప్రమాదకర మైన స్థలంగా గుర్తించి. ముందు ముందు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. ఎస్సై రాజేష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## కృత్రిమ మేధస్సు మరియు మెషీన్ లెర్నింగ్‌పై...

# రెండు రోజుల గ్లోబల్ చర్చలు విజయవంతం



శంకర్ పల్లి, మార్చి 26 (పోలీస్ నిఘా) : కృత్రిమ మేధస్సు మరియు మెషీన్ లెర్నింగ్ పై రెండు రోజుల గ్లోబల్ చర్చలు విజయవంతంగా ముగిశాయి. కృత్రిమ మేధస్సు మరియు మెషీన్ లెర్నింగ్ లో పురోగతులపై అంతర్జాతీయ సదస్సు ( ఐ సీ ఏ సీ ఐ ఎం ఎల్ 2026)ను ఇక్ఫై టెక్, ఐ ఎఫ్ ఎచ్ ఈ హైదరాబాద్లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాలు మరియు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ బ్లాక్చైన్ సం యుక్తంగా నిర్వహించగా, రెండు రోజులపాటు జరిగిన కీలక చర్చలు, ప్రధాన ప్రసంగాలు మరియు పరిశోధనా సమర్పణలతో విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు మరియు పరిశ్రమ నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, కృత్రిమ మేధస్సు మరియు మెషీన్ లెర్నింగ్ రంగాలలో జ్ఞాన మార్పిడి మరియు ఆవిష్కరణలకు చురుకైన వేదికగా నిలిచింది. సదస్సు ప్రారంభోత్సవ సమావేశంతో ప్రారంభమై, ఐ ఎఫ్ ఎచ్ ఉపకులపతి ప్రొఫెసర్ టి. కోటి రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. విజయలక్ష్మి, ఇక్ పై టెక్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. ఎల్. నారాయణ సంక్షిప్తమైన మరియు ప్రభావవంతమైన ప్రసంగాలు చేశారు. వారు సంస్థ అకడమిక్ ప్రతిభ, పరిశోధన మరియు అంతర్జాతీయ సహకారంపై తన కట్టుబాటును హైలైట్ చేశారు. ఈ సమావేశాన్ని సదస్సు కన్వీనర్ డాక్టర్ సందీప్ కుమార్ పాండా, జనరల్ చైర్ డాక్టర్ పవన్ కుమార్, సహ-చైర్స్ డాక్టర్ రోహిణి మరియు డాక్టర్ ప్రదోష్ కుమార్ నిర్వహించారు. వారు సదస్సు లక్ష్యాలు మరియు నిర్మాణాన్ని వివరించారు. రెండు రోజులపాటు సదస్సులో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ సంస్థల నుండి వచ్చిన విశిష్ట వక్తల ప్రధాన ప్రసంగాలు జరిగాయి. జర్మనీలోని టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ కెమ్నిట్జ్కు చెందిన డాక్టర్ అలాజేంద్రో మస్రూర్ ట్రైన్ సిస్టమ్ ఆటోమేషన్ మరియు వైఫై సెన్సింగ్ టెక్నాలజీలలో మెషీన్ లెర్నింగ్ అనువర్తనాలపై ప్రసంగిస్తూ, వాటి అవకాశాలు, స్కేలబిలిటీ, విశ్వసనీయత మరియు డేటా గోప్యత వంటి సవాళ్లను వివరించారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రూర్కీకి చెందిన ప్రొఫెసర్ సతీష్ కుమార్ "ఆండ్రాయిడ్ మాల్వేర్ గుర్తింపులో మెషీన్ లెర్నింగ్ వినియోగం" అనే అంశంపై ప్రసంగించి, సైబర్ సెక్యూరిటీ బలోపేతంలో ఏఐ పాత్రను వివరించారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మేఘాలయకు చెందిన ప్రొఫెసర్ దీప్తేందు సిన్హా రాయ్ "స్మార్ట్ మరియు డిస్ట్రిబ్యూటెడ్ సిస్టమ్స్ కోసం కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్"పై అవగాహన ఇచ్చారు. సదస్సులో ప్రధాన ఆకర్షణగా "మానవ మేధస్సును పునర్నిర్వచి ంచడం ఏ ఐ , భావోద్వేగ మరియు జ్ఞాన వైవిధ్యం" అనే అంశంపై ప్యానెల్ చర్చ జరిగింది. దీనిని ఇక్ఫై యూనివర్సిటీ, సిక్కిం ఛాన్సలర్ ప్రొఫెసర్ ఓ. ఆర్. ఎస్. రావు మోడరేట్ చేశారు. ఈ చర్చలో కెనడాకు చెందిన జీనెస్ట్ ఏఐ సంస్థకు చెందిన శ్రీమతి స్వర్ణమౌళి మజుందార్, ఐఐటీ హైదరాబాద్కు చెందిన డాక్టర్ జి. నరహరి శాస్త్రి, విప్రో మాజీ వైస్ ప్రెసిడెంట్ శ్రీ వేణుగోపాల్, సుప్ర సంస్థకు చెందిన జి. ప్రసన్న, రెడ్ బెలూన్ ఏరోస్పేస్కు చెందిన డాక్టర్ సి. వి. ఎస్. కిరణ్ పాల్గొన్నారు. ఈ చర్చలో ఏఐ వ్యవస్థల్లో భావోద్వేగ మేధస్సు మరియు జ్ఞాన వైవిధ్యాన్ని సమన్వయం చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఇంకా ఇతర ముఖ్య ప్రసంగాలు కూడా సదస్సును మరింత సమృద్ధిగా చేశాయి. ఒడిశాలోని కే ఈ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుభేందు కె. యు. పాణి "వాస్తవ ప్రపంచ ప్రభావం కోసం మానవ కేంద్రిత ఏఐ వ్యవస్థలు" అనే అంశంపై ప్రసంగించారు. స్వర్ణమౌళి మజుందార్ "సురక్షిత నగరాలు మరియు సమాజాల కోసం ఏఐ " అనే అంశంపై మాట్లాడుతూ, పట్టణ భద్రత, ప్రజా సేవలు మరియు సమాజ స్థిరత్వం పెంపులో ఏఐ పాత్రను వివరించారు. ప్రధాన ప్రసంగాలతో పాటు, సదస్సులో రెండు రోజులపాటు సాంకేతిక పేపర్ ప్రెజెంటేషన్లు మరియు సమాంతర సెషన్లు నిర్వహించబడ్డాయి. వీటిలో స్మార్ట్ సిస్టమ్స్, సైబర్ సెక్యూరిటీ, ఆప్టిమైజేషన్ టెక్నిక్స్ మరియు వాస్తవ ప్రపంచ ఏఐ అనువర్తనాలపై పరిశోధనలు ప్రదర్శిం చబడ్డాయి. ఈ సెషన్లు అకడమిక్ చర్చలు, విశ్లేషణ మరియు సహకారానికి మంచి వేదికగా నిలిచాయి. సదస్సు ముగింపు సమావేశంతో ముగిసింది. నిర్వాహకులు ఈ కార్యక్రమ విజయాన్ని సమీక్షిస్తూ, వక్తలు, పాల్గొన్న వారు మరియు నిర్వాహక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సదస్సు కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్ మరియు మెషీన్ లెర్నింగ్ ప్రాముఖ్యతను మరింతగా చాటిచెప్పింది. మొత్తంగా, ఐ సీ ఏ సీ ఐ ఎం ఎల్ 2026 అకడమిక్ కఠినతను మరియు పరిశ్రమ ప్రాముఖ్యతను సమన్వయం చేసిన ఒక ముఖ్యమైన అంతర్జాతీయ వేదికగా నిలిచి, తెలివైన వ్యవస్థల రంగంలో భవిష్యత్తు పరిశోధన, సహకారం మరియు ఆవిష్కరణలకు దారితీసింది.

## స్వామి వారిని దర్శించుకున్న సర్పంచుల పోరం రాష్ట్ర అధ్యక్షుడు సౌదామి భూమన్న యాదవ్

**సర్పంచుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి**

**తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ల ఫోరం జనరల్ సెక్రెటరీగా సుర్వి మల్లేష్**





యాదగిరిగుట్ట, మార్చి 26 (పోలీస్ నిఘా) : రాష్ట్రంలోని సర్పంచ్ల సంక్షేమానికి ప్రభుత్వం తగిన విధంగా కృషి చేయాలి అని రాష్ట్ర సర్పంచుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు సౌధాని భూమన్న యాదవ్ అన్నారు. గురువారం ఆయన యా దగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహి ంచారు. అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచ్ల సంఘం అధ్యక్షులు కొప్పుల వెంకటరెడ్డి జిల్లా సర్పంచుల ఫోరం నేతలతో కలిసి మాట్లాడుతూ సర్పంచ్లకు తగిన విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులు సరిపోను కేటాయించాలని కోరారు. గతంలో పెండింగ్లో ఉన్న బిల్లులను కూడా చెల్లించాలని కోరారు. సర్పంచ్లకు ఎక్కడ ఏ ఇబ్బంది వచ్చినా తాము అందుబా టులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరి స్తామని అన్నారు. సర్పంచ్లు అంతా గ్రామాల అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు. పార్టీలకతీతంగా సర్పంచ్ అంత రాష్ట్ర సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో కలిసి కట్టుగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు కొప్పుల వెంకటరెడ్డి కార్యవర్గాన్ని అభినందించారు. ఈ సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచ్ల ఫోరం నూతన అధ్యక్షుడు కొప్పుల వెంకటరెడ్డి సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మల్లేష్ గౌడ్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టేకుల మంజుల సంఘం రాష్ట్ర సలహాదారులు కే రవీందర్ యాదవ్ జిల్లా ఉపాధ్యక్షులు తాండ్ర నారాయణస్వామి నాయకులు, గంగాపురం మల్లేష్ పచ్చిమట్ల మదర్ గౌడ్ మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్లు వరి ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలి

### హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో వరి ధాన్యం కొనుగోలు పై జిల్లాలోని రైస్ మిల్లర్లతో కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సమీక్షా సమావేశం




హనుమకొండ, మార్చి 26 (పోలీస్ నిఘా) : జిల్లాలో రబీ సీజన్ కు సంబంధించి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని రైస్ మిల్లర్లు దిగుమతి చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలు లో రబీ సీజన్ కు సంబంధించి రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపు, దిగుమతి, తదితర అంశాలపై జిల్లాలోని రైస్ మిలర్లతో సమీక్షా సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆయా ప్రాంతాలలో ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కేటాయింపులు చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం దిగుమతి చేసుకోవాలని రైస్ మిల్లర్లకు సూచించారు. ధాన్యం కేటాయింపు విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి రైస్ మిల్లర్లు తీసుకురావాలని తెలిపారు. ధాన్యం కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు ప్యాడి క్లీనర్ల ద్వారా శుభ్రపరచిన ధాన్యాన్ని బిల్లులకు పంపించాలని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు తమ రైస్ మిల్లులో ధాన్యాన్ని భద్రపరచుకునేందుకు వీలుగా సరైన స్థలాన్ని ఉండేటట్లు చూసుకోవాలన్నారు. మిల్లులకు నేరుగా వచ్చిన ధాన్యాన్ని తీసుకోవద్దని మిల్లర్లకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎండి వాజిద్ అలీ, జిల్లా సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, ఇతర అధికారులతో పాటు జిల్లాకు సంబంధించిన రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట, బొమ్మలరామారం మండలాల్లో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పర్యటన



యాదగిరిగుట్ట, మార్చి 26 (పోలీస్ నిఘా) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య యాదగిరిగుట్ట, బొమ్మలరామారం మండలాల్లో పర్యటించారు. యాదగిరిగుట్ట మండలం సైదాపూర్ గ్రామంలో ఆయన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుని ఇంటిని సందర్శించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. సైదాపూర్ చెరువు నిండిపోవడంతో అలుగు పారుతున్న నేపథ్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి బొమ్మలరామారం మండల కేంద్రంలోని గట్టు మైసమ్మ తల్లి ఆలయం వద్ద సీసీ రోడ్డు పనులను కొబ్బరికాయ కొట్టి శుభారంభం చేశారు. అనంతరం అక్కడ కూడా ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుని ఇంటిని సందర్శించి అభినందనలు తెలిపారు.

## జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

### వదంతులను నమ్మవద్దు: జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి, మార్చి 26 (పోలీస్ నిఘా) : పెట్రోల్, డీజిల్ కొరత ఉన్నట్లు సోషల్ మీడియా, ఇతర మార్గాల ద్వారా వదంతులు ప్రచారం అవుతున్న నేపథ్యంలో, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఒక ప్రకటనలో మాట్లాడు తూ.. జిల్లాలో ఎటువంటి ఇంధన కొరత లేదని, పెట్రోల్, డీజిల్ సరఫరా సాధారణంగా కొనసాగుతోంది అన్నారు. ప్రజలు వదంతులను నమ్మి అనవసరంగా ఆందోళన చెందవద్దని, అవసరానికి మించి ఇంధనాన్ని కొనుగోలు చేయడం లేదా నిల్వచేయడం చేయవద్దని సూచించారు. ఇలాంటి చర్యలు ఇతరులకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని, అట్టి వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా, ఇంధనాన్ని అక్రమంగా నిల్వ చేసే వారిపై కూడా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ఎటువంటి అనుమానాస్పద సమాచారాన్ని గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీస్ కంట్రోల్ నెంబర్ 8712656739 కు సమాచారం అందించాలని, తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో ఫార్వర్డ్ చేయకూడదని సూచించారు. బాధ్యతాయుతంగా ప్రవర్తించి సమాజంలో శాంతి భద్రతలను కాపాడడంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## డి.ఎస్.పి శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో అరైవ్ అలైవ్




యాదగిరిగుట్ట, మార్చి 26 (పోలీస్ నిఘా) : రాంగ్ రూట్ లో డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరుగుతాయని యాదగిరిగుట్ట డి.ఎస్.పి శ్రీనివాస్ నాయుడు అన్నారు. గురువారం యాదగిరిగుట్ట బస్టాండ్ నందు అరైవ్ అలైవ్ ప్రోగ్రాం లో భాగంగా స్థానిక బస్టాండ్ నందు ఓవర్ టేకింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాలు రాంగ్ రూట్ లో డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలు గురించి డి.ఎస్.పి శ్రీనివాస్ నాయుడు ప్రజలకు క్లుప్తంగా వివరించారు. ప్రయాణం చేసేటప్పుడు ఫోర్ వీలర్ లో ప్రయాణం చేసేవారు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని టూవీలర్ ప్రయాణం చేసేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. డ్రైవింగ్ చేసే సమయంలో ఏమాత్రం జాగ్రత్తలు పాటించకుండా డ్రైవింగ్ చేస్తే ప్రాణాలు పోయే పరిస్థితి వస్తుందని, ప్రమాదాలు జరిగితే జీవితాంతం ఇంటికి పరిమితం అవుతారని ఇక్కడ మీరు మీ కుటుంబ సభ్యులు బాధపడాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎలగొండ కృష్ణ, ఎస్సైలు దేవేందర్, సైదులు, కృష్ణస్వామి, రూప శ్రీ కానిస్టేబుల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండ జాగృతి హాస్పిటల్‌లో దారుణం



వరంగల్, మార్చి 26 (పోలీస్ నిఘా) : డెలివరీ కోసం ఆసుపత్రికి వచ్చిన ఓ గర్భిణి మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారి తీసింది. వివరాల్లోకి వెళ్తే హన్మకొండ బాలసముద్రం దగ్గర ఉన్న జాగృతి హాస్పిటల్ కి డెలివరీ కోసం జాగృతి హాస్పిటల్ కు వచ్చిన పేషెంట్ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందింది.కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా, ఆమెను మరో ఆసుపత్రికి తరలించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనంతరం అక్కడి నుంచి మృతదేహాన్ని ఎంజీఎం ఆసుపత్రి కు తరలించారు. ఈ ఘటనపై ఆగ్రహంతోమృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున జాగృతి హాస్పిటల్‌కు చేరుకున్నారు. ఆసుపత్రి ముందు ధర్నా చేయడానికి సిద్ధమవుతున్నారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే అవకాశం ఉంది.ఇదిలా ఉండగాపరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో జాగృతి హాస్పిటల్ యాజమాన్యం ఆసుపత్రికి తాళం వేసి వెళ్లిపోయారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## డబ్బాలలో పెట్రోల్, డీజిల్ నిల్వ చేయడం నిషేధం

### -జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు-



మెదక్, మార్చి 26 (పోలీస్ నిఘా) : మెదక్ జిల్లాలో పెట్రోల్, డీజిల్‌ను డబ్బాలు, ప్లాస్టిక్ కంటైనర్లు లేదా వాటర్ బాటిళ్లలో పోయడాన్ని పూర్తిగా నిషేధించాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఒక ప్రకటన లో తెలిపారు. ఇంధనాన్ని డబ్బాలలో నిల్వ చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించే ప్రమాదం అధికంగా ఉంటుందని హెచ్చరించారు.ప్రజల భద్రత దృష్ట్యా ఎవరూ కూడా పెట్రోల్, డీజిల్‌ను ఇంట్లో లేదా ఇతర ప్రదేశాల్లో డబ్బాలలో నిల్వ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ప్లాస్టిక్ బాటిళ్లలో నిల్వ చేయడం వల్ల లీకేజీలు, అగ్ని ప్రమాదాలు, పేలుళ్లు సంభవించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు చట్టపరమైన సమస్యలకు దారితీసే అవకాశముందని తెలిపారు.అదేవిధంగా, ఈ మేరకు పెట్రోల్ బంక్ డీలర్లకు స్పష్టమైన సూచనలు జారీ చేస్తూ, తమ బంక్ ప్రాంగణంలో "డబ్బాలలో పెట్రోల్, డీజిల్ పోయడం నిషేధం" అనే బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. బంక్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.ఇక, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న రెండు పెట్రోల్ బంకులను నెలరోజుల్లో ప్రారంభించి, ప్రజలకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌ను అందిస్తామని ఎస్పీ తెలిపారు.

## మార్క్ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి



ఏన్కూరు , మార్చి 26 (పోలీస్ నిఘా) : రబీ సీజన్లో పండిన మొక్కజొన్నల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మార్క్ఫెడ్ కేంద్రాలను ప్రారంభించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు సిపిఎం మండల కార్యదర్శి దొంతి పోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఏన్కూరు తాసిల్దార్ కార్యాలయంలో రైతులు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో తక్షణమే ప్రారంభించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు . నాగేశ్వరరావు .మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో రబీ సీజన్లో లక్ష ఎకరాలు పైగా మొక్కజొన్న సాగు జరుగుతుందని తెలిపారు. మార్క్ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు తమ పంటను బహిరంగ మార్కెట్లో తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వస్తుందని చెప్పారు. ప్రస్తుతం కింటాకు 1600 నుంచి 1700 వరకు మాత్రమే ధర లభిస్తుందని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటాల్కు 2400 ఉండగా రైతులకుభారీ నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి వెంటనే మార్క్ఫెడ్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులకు మద్దతు ధర కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దుర్గి కృష్ణకార్యదర్శి భూక్య లక్ష్మ మండల అధ్యక్షుడు నందూరి శ్రీనివాసరావు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఇటికాల తమ్మినేని. వెంకటయ్య. శ్రీనివాసరావు. నాగరాజు. వెంకటేష్. తదితరులు రైతులు పాల్గొన్నారు.


# చిత్రం

## 'కరుప్పు'.. సూర్య కమ్ బ్యాక్ పక్కానా?



కోలీవుడ్ స్టార్ హీరోల్లో సూర్య స్టైల్ ప్రత్యేకం. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు పూర్తి భిన్నంగా కథాబలమున్న సినిమాలతో పాటు సరికొత్త కథలు, క్యారెక్టర్లతో ప్రత్యేక గుర్తింపుని సొంతం చేసుకున్న సూర్య గత కొంత కాలంగా వరుస ఫ్లాపులు, డిజాస్టర్లతో సతమతమవుతూ రేసులో వెనబడిపోయారు. ఒక దశలో వరుస బ్లాక్ బస్టర్లని సొంతం చేసుకున్న సూర్య ఇప్పుడు సరైన హిట్ల కోసం ఎదురు చూస్తున్నాడు. 'జైభీమ్' తరువాత సూర్య హిట్టు మాట విని ఏళ్లు గడుస్తున్నాయి. సామాజిక సమస్య నేపథ్యంలో చేసిన 'ఈటీ' ఫలితాన్ని ఇవ్వలేదు. భారీ అంచనాలతో పాన్ ఇండియా వైడ్‌గా సంచలనాలు సృష్టించాలని చేసిన ఫాంటసీ యాక్షన్ మూవీ 'కంగువా' బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచి షాక్ ఇచ్చింది. రూ.300 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తే అందులో రూ.100 కోట్లు మాత్రమే తిరిగి రాబట్టి డిజాస్టర్‌గా బాప్ అనిపించుకుంది. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా చేసిన 'రెట్రో' కూడా ఇదే ఫలితాన్ని అందించి సూర్యని ఆలోచనలో పడేసింది. దీంతో కంగారుపడిన సూర్య ఆలోచించి అడుగులు వేయడం మొదలు పెట్టారు. సక్సెస్ కోసం ఆర్జే బాలాజీ చెప్పిన 'కరుప్పు' కథని నమ్మి రూటెడ్ స్టోరీతో సినిమా చేశారు. త్రిష కథానాయికగా నటించిన ఈ మూవీ రిలీజ్‌కు రెడీ అయినా ప్రస్తుతం ఉన్న పోటీ దృష్ట్యా మేకర్స్ ఈ మూవీ రిలీజ్‌ని మే 14కు వాయిదా వేశారు. దీనితో పాటు తెలుగు డైరెక్టర్ వెంకీ అట్లూరితో కలిసి తెలుగు స్ట్రెయిట్ ఫిల్మ్ 'విశ్వనాథ్ అండ్ సన్స్' చేశారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. త్వరలోనే రిలీజ్ డేట్‌ని మేకర్స్ ప్రకటించే అవకాశం ఉంది. గత కొంత కాలంగా వరుస ఫ్లాపుల్లో ఉన్న సూర్య స్ట్రాంగ్ కమ్ బ్యాక్ ఇవ్వాలని చూస్తున్నాడు. పక్కా రూటెడ్ స్టోరీతో చేసిన 'కరుప్పు'తో సూర్య కమ్ బ్యాక్ ఇస్తాడనే చర్చ కోలీవుడ్‌లో నడుస్తోంది. దానికి ప్రధాన కారణం ఈ మూవీ ప్రీరిలీజ్ బిజినెస్ ఇప్పటికే రూ.110 కోట్లు దాటింది. ఇందులో మ్యూజిక్ రైట్స్‌ని థింక్ మ్యూజిక్ ఇండియాకు ఇచ్చేశారు. ఇక సౌత్ శాటిలైట్ హక్కుల్ని జీ నెట్ వర్క్‌కి భారీ మొత్తాన్ని అమ్మేశారు. అంతే కాకుండా హిందీ శాటిలైట్ రైట్స్ అండ్ డిజిటల్ హక్కుల్ని జయంతి లాల గడకు చెందిన పెన్ స్టూడియో సొంతం చేసుకుంది. ఓటీటీ స్ట్రీమింగ్ హక్కుల్ని భారీ మొత్తానికి అమెజాన్ ప్రైమ్ వీడియో దక్కించుకుంది. సినిమా మే 14న వస్తుందని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ వారు అధికారికంగా ప్రకటించడంతో థియేట్రికల్ బిజినెస్‌కు సంబంధించిన ఎంక్వైరీలు తమిళనాడు , ఏపీ, తెలంగాణ, కర్ణాటక అండ్ ఓవర్సీస్ నుంచి భారీ స్థాయిలో మొదలైనట్టుగా కోలీవుడ్ వర్గాల్లో వినిపిస్తోంది. త్వరలోనే థియేట్రికల్ బిజినెస్ కూడా పూర్తి చేసి టీమ్ ఏప్రిల్ నుంచి ప్రమోషన్స్‌ని గట్టిగా ప్లాన్ చేస్తున్నారట. బిజినెస్ ప్లాన్ చూస్తుంటే సూర్య 'కరుప్పు'తో గట్టిగానే కమ్ బ్యాక్ ఇచ్చేలా ఉన్నాడని తెలుస్తోంది.

## రాజమౌళి హాలీవుడ్ గేమ్ ప్లాన్



రాజమౌళి ఏ పని చేసినా దాని వెనుక ఒక బలమైన కారణం ఉంటుంది. ప్రస్తుతం మహేష్ బాబుతో తెరకెక్కిస్తున్న 'వారణాసి' చిత్రం విషయంలోనూ అదే జరుగుతోంది. ఈ సినిమా షూటింగ్ సెట్స్‌లోకి హాలీవుడ్ మీడియాకు మాత్రమే స్పెషల్ యాక్సెస్ ఇస్తూ, లోకల్ మీడియాను, తెలుగు జర్నలిస్టులను దూరంగా ఉంచుతుండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మన వాళ్లను కాదని విదేశీ మీడియాకు అంత ప్రాధాన్యత ఇవ్వడం ఏంటని చాలా మంది సోషల్ మీడియాలో అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే రాజమౌళి తీసుకున్న ఈ నిర్ణయం వెనుక ఒక పక్కా బిజినెస్ ప్లాన్ ఉందనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. నిజానికి రాజమౌళి మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాకు తెలుగు రాష్ట్రాల్లో ప్రమోషన్లు పెద్దగా అవసరం లేదు. ఈ క్రేజీ ప్రాజెక్టుకు సంబంధించిన చిన్న పోస్టర్ వచ్చినా బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయం. అసలు ట్రైలర్ కూడా విడుదల చేయకపోయినా సరే, తెలుగు గడ్డపై ఈ సినిమాకు కళ్లు చెదిరే ఓపెనింగ్స్ వస్తాయి. ఇక్కడి ప్రేక్షకులకు రాజమౌళి బ్రాండ్ వాల్యూ, మహేష్ బాబు స్టార్ పవర్ మీద పూర్తి నమ్మకం ఉంది. అందుకే లోకల్ మీడియా కంటే అంతర్జాతీయ స్థాయి మార్కెట్‌ను ప్రభావితం చేసే మీడియాని ఆయన ఎంచుకున్నారు. అసలు విషయం ఏంటంటే, ఈ సినిమాను కేవలం ఇండియన్ లెవల్‌లోనే కాకుండా హాలీవుడ్, యూరప్, చైనా మార్కెట్లలో భారీగా విడుదల చేయాలని రాజమౌళి ప్లాన్ చేస్తున్నారు. ఆ దేశాల్లో సినిమాకు భారీ ఓపెనింగ్స్ రావాలంటే అక్కడి మీడియా హౌస్‌ల ద్వారా పబ్లిసిటీ రావడం చాలా ముఖ్యం. అమెరికన్ మీడియాలో వచ్చే కథనాలు హాలీవుడ్ ప్రేక్షకులకు సినిమాపై క్యూరియసిటీని పెంచుతాయి. అందుకే వెస్టర్న్ మీడియాను సెట్స్‌లోకి ఆహ్వానించి, అక్కడి మార్కెట్‌కు కావాల్సిన బజ్ ను రాజమౌళి ముందే ప్లాన్ చేస్తున్నారు. ఇది ఒక రకంగా సినిమాను గ్లోబల్ ప్రొడక్ట్‌గా మార్చే ప్రయత్నం. రాజమౌళి విజన్ ఎప్పుడూ ఒక అడుగు ముందే ఉంటుంది. 'ఆర్ఆర్ఆర్' తో అతను సాధించిన అంతర్జాతీయ గుర్తింపును 'వారణాసి'తో మరింత పెంచుకోవాలని చూస్తున్నారు. హాలీవుడ్ టెక్నీషియన్లు, ఇంటర్నేషనల్ స్టార్స్ ఈ ప్రాజెక్టులో భాగం అవ్వడం వల్ల విదేశీ మీడియాలో ఈ సినిమాపై ఆసక్తి పెరిగింది. లోకల్ మీడియాకు ఎలాగూ సినిమా రిలీజ్ సమయంలో యాక్సెస్ ఉంటుంది, కానీ గ్లోబల్ ఆడియన్స్‌ను రీచ్ అవ్వడానికి మాత్రం హాలీవుడ్ ప్రెస్ అవసరం ఎంతో ఉంది. దీన్ని గుర్తించే రాజమౌళి తన ఫోకస్ అంతా వెస్ట్రన్ మీడియాపై పెట్టినట్లు అర్థమవుతోంది. రూ. 1300 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద లాభాల్లోకి రావాలంటే విదేశీ వసూళ్లు చాలా కీలకం. కేవలం మన దేశంలోని కలెక్షన్లతో ఇంతటి భారీ టార్గెట్ ని రికవరీ చేయడం సాధ్యం కాదు. అందుకే ఇంటర్నేషనల్ బాక్సాఫీస్ దగ్గర సినిమాకు మైలేజ్ ఇచ్చే ఏ చిన్న అవకాశాన్ని కూడా రాజమౌళి వదులుకోవడం లేదు. హాలీవుడ్ మీడియాకు ఇస్తున్న ఈ స్పెషల్ యాక్సెస్ భవిష్యత్తులో సినిమా వసూళ్ల రూపంలో ప్రతిఫలాన్ని ఇస్తుందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు. రాజమౌళి చేస్తున్న ఈ ప్రయోగం సక్సెస్ అయితే భారతీయ సినిమా మార్కెట్ సరిహద్దులు మరింత మారిపోతాయని చెప్పవచ్చు.

## జూలై 3న వస్తున్న నాగబంధం




సినీ పరిశ్రమలో ప్రస్తుతం మైథాలజీ ఫాంటసీ కథల ట్రెండ్ నడుస్తోంది. హనుమాన్, కాంతార వంటి సినిమాలు క్రియేట్ చేసిన ఇంపాక్ట్ తో మన పురాణాల్లోని అద్భుతాలను వెండితెరపై చూడాలని ప్రేక్షకులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే అనౌన్స్‌మెంట్ నుండే హైప్ క్రియేట్ చేసిన సినిమా 'నాగబంధం'. అభిషేక్ నామ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం టీజర్ లోని విజువల్స్ తోనే హాట్ టాపిక్ గా మారింది. ఒక విభిన్నమైన ప్రపంచాన్ని సృష్టించే ప్రయత్నం ఈ సినిమాలో కనిపిస్తోంది. ఈ మధ్యకాలంలో గ్రాఫిక్స్ తో కూడిన కథలు వస్తున్నప్పటికీ, వాటిలో ఎమోషన్ ఉంటేనే జనాలు ఆదరిస్తున్నారు. 'నాగబంధం' టీజర్ లో చూపించిన ఎలిమెంట్స్ చూస్తుంటే ఇందులో కూడా ఒక బలమైన కథా వస్తువు ఉన్నట్లు అర్థమవుతోంది. విరాట్ కర్ణ తన రెండో సినిమాకే ఇలాంటి ఒక భారీ సబ్జెక్టును ఎంచుకోవడం విశేషం. శివుని అంశతో కూడిన యోధుడి పాత్రలో లుక్ చాలా ఇంటెన్సిటీతో కనిపిస్తోంది. నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కూడా ఇందులో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. చాలా కాలంగా ఈ సినిమా విడుదల ఎప్పుడు ఉంటుందా అని వేచి చూస్తున్న అభిమానులకు ఫైనల్ గా ఒక క్లారిటీ వచ్చింది. మేకర్స్ ఒక పవర్ ఫుల్ పోస్టర్ ద్వారా రిలీజ్ డేట్ ను ప్రకటించారు. ఈ క్రేజీ మైథాలజీ మూవీ జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయబోతోంది. విడుదల చేసిన పోస్టర్ లో హీరోకు, విలన్ కు మధ్య జరిగే పోరాటాన్ని చాలా ఎఫెక్టివ్ గా చూపించనున్నట్లు అర్థమవుతుంది. చీకటికి వెలుగుకు మధ్య జరిగే ఈ యుద్ధం వెండితెరపై ఎలా ఉండబోతోందో అని ఆడియన్స్ లో క్యూరియాసిటీ మొదలైంది. పోస్టర్ లోని డిజైన్ గమనిస్తే, పురాతన ఆలయాలు, బంగారు విగ్రహాలు వంటివి కథలోని డెప్త్ ని చూపిస్తున్నాయి. కేవలం విజువల్స్ మాత్రమే కాకుండా, ఈ సినిమాలో స్పిరిచువల్ జర్నీ కూడా ప్రధానంగా ఉండబోతోందని మేకర్స్ చెబుతున్నారు. ఇప్పటికే విడుదలైన 'నమో రే' సాంగ్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో నిర్మించారు. విదేశీ దండయాత్రల నేపథ్యంలో భారతీయ నిధులను కాపాడే క్రమంలో ఈ 'నాగబంధం' చుట్టూ కథ తిరుగుతుందని తెలుస్తోంది. ఈ సినిమా సక్సెస్ పై విరాట్ కర్ణ చాలా నమ్మకంగా ఉన్నాడు. తన బాడీ లాంగ్వేజ్ పై చేసిన వర్క్ ప్రతి ఫ్రేమ్ లోనూ కనిపిస్తోంది. టెక్నికల్ గా చూస్తే అశోక్ కుమార్ విజువల్ ఎఫెక్ట్స్ ఈ సినిమాకు మెయిన్ పిల్లర్ గా నిలిచేలా ఉన్నాయి. కేవలం తెలుగులోనే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయబోతున్నారు. భారీ సెట్టింగ్స్, అద్భుతమైన కెమెరా వర్క్ తో మేకర్స్ ఒక కొత్త బెంచ్ మార్క్ సెట్ చేయాలని చూస్తున్నారు. రిలీజ్ డేట్ రావడంతో ఇక ప్రమోషన్స్ స్పీడ్ పెంచే ప్లాన్ లో ఉంది చిత్ర యూనిట్. మొత్తానికి వేసవి తర్వాత జూలైలో ఈ సినిమా రావడం బాక్సాఫీస్ దగ్గర మంచి అడ్వాంటేజ్ అయ్యే అవకాశం ఉంది. ఎలాంటి పోటీ లేని సమయంలో సోలోగా రాగలిగితే వసూళ్ల పరంగా కూడా కలిసొస్తుంది.

## 'పాపం ప్రతాప్' టీజర్ విడుదల



టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న యంగ్ హీరో తిరువీర్ మరో కొత్త ఎంటర్టైనర్ తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. మసూద, పరేషాన్, ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో వంటి చిత్రాలతో వరుస విజయాలు అందుకున్న ఆయన తాజా చిత్రం పాపం ప్రతాప్ పై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజాగా విడుదలైన టీజర్ తో ఆ అంచనాలు మరింత పెరిగాయి. విలేజ్ బ్యాక్ డ్రాప్ తో తెరకెక్కిన ఆ సినిమా రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ గా రూపొందుతోంది. ఎస్.పీ. దుర్గ నరేష్ దర్శకత్వం వహించగా, ఈటీవీ విన్ ఒరిజినల్స్ నిర్మించింది. తిరువీర్ సరసన పాయల్ రాధాకృష్ణ హీరోయిన్ గా నటిస్తుండగా.. సినిమా ఏప్రిల్ 17న థియేటర్లలో సమ్మర్ గా కానుకగా విడుదల కానుంది. తాజాగా ఈటీవీ విన్ టీజర్ ను రిలీజ్ చేయగా, ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. మొదటి నుండి చివరి వరకు సరదాగా సాగిన టీజర్ లో ఎంటర్టైన్మెంట్ తోపాటు ఒక సున్నితమైన అంశాన్ని చూపించినట్లు కనిపిస్తోంది. ప్రతాప్ అనే యువకుడు తన చిన్ననాటి ప్రేయసి బుజ్జమ్మను ప్రేమించి పెళ్లి చేసుకుంటాడు. స్కూల్ రోజుల్లో ప్రారంభమైన వారి ప్రేమ కథను చాలా మధురంగా చూపించారు. పెళ్లి వరకు అన్నీ బాగానే సాగుతాయి. అయితే పెళ్లి తర్వాత జీవితం ఎలా ఉంటుందో చూడాలని బుజ్జమ్మ చెప్పడం కథలో కీలక మలుపుగా నిలుస్తుంది. పెళ్లి అయిన తర్వాత మొదటి మూడు రోజులు సజావుగా గడుస్తాయి. కానీ ఆ తర్వాత పరిస్థితులు ఒక్కసారిగా మారిపోతాయి. బుజ్జమ్మ పంచాయతీకి వెళ్లి ప్రతాప్ పై ఫిర్యాదు చేయడం కథలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. దీంతో గ్రామస్థులంతా ప్రతాప్ లో ఏదైనా లోపం ఉందా అనే అనుమానాలు వ్యక్తం చేస్తారు. ఆ సందేహాల మధ్య అసలు సమస్య ఏమిటి? బుజ్జమ్మ ఎందుకు అలా చేసింది? ప్రతాప్ జీవితంలో ఏమి జరిగిందన్నది చిత్రంలో సస్పెన్స్ గా ఉంచారు. ఆ అంశాన్ని దర్శకుడు ఎంటర్టైన్మెంట్ అందిస్తూ చెప్పే ప్రయత్నం చేసినట్లు టీజర్ ద్వారా అర్థమవుతోంది. సినిమాలో గ్రామీణ వాతావరణం, నేచురల్ రోల్స్, ఫన్నీ కన్వర్జేషన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని తెలుస్తోంది. కామెడీతో పాటు ఎమోషన్స్ ను కూడా మేకర్స్ యాడ్ చేసినట్లు టీజర్ చెప్పకనే చెబుతోంది. ఏదేమైనా పాపం ప్రతాప్ మూవీ కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనునట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రతాప్ పాత్రలో తిరువీర్ యాక్టింగ్ నేచురల్ గా కనిపిస్తుండగా, బుజ్జమ్మ పాత్రలో పాయల్ రాధాకృష్ణ తన పాత్రకు న్యాయం చేసినట్లు టీజర్ లో స్పష్టమవుతోంది. మొత్తానికి పాపం ప్రతాప్ సాధారణ ప్రేమకథగా ప్రారంభమై, పెళ్లి తర్వాత జరిగే పరిణామాలతో ఇంట్రెస్టింగ్ స్టోరీగా కనిపిస్తోంది. ఎంటర్టైన్మెంట్, ప్రేమ, సస్పెన్స్ ఎలిమెంట్స్ తో చిత్రం ప్రేక్షకులను అలరించే అవకాశం ఉంది. మరి సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని సాధిస్తుందో వేచి చూడాలి.

## చిన్నారులకు నాణ్యమైన విద్య, పోషకాహారం: సీఎం రేవంత్



హైదరాబాద్, మార్చి 26 (పోలీస్ నిఘా) : రాష్ట్రంలోని ప్రతి చిన్నారికీ నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రితో ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్ రాష్ట్ర శాసనమండలి హాల్‌లో గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చించారు. రాష్ట్రంలో 0–10 ఏళ్లలోపు పిల్లల్లో పోషకాహారం లోపం, విద్యాభ్యాసన స్థాయి సామర్థ్యలోపాలకు సంబంధించి పలు నివేదికలను కార్తీక్ మురళీధరన్ సీఎం దృష్టికి తీసుకొచ్చారు. చిన్న వయస్సులో పోషకాహారం లోపంతో భవిష్యత్తులో తలెత్తే ఆరోగ్య సమస్యలు.. ప్రాథమిక స్థాయిలో సరైన బోధన లభించకపోతే విద్యార్థి భావి జీవితంలో పడే మానసిక వేదనను ఆయన తెలియజేశారు. వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన అంశాలను సూచించారు. ఆయా అంశాలపై తాము ఇప్పటికే ప్రత్యేక శ్రద్ధ పెట్టామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతోపాటు అల్పాహారం పెట్టేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లు వివరించారు. అంగన్‌వాడీల్లో కార్యకర్తలు, ఆయాలతో పాటు పోషకాహారం అందజేసేందుకు అదనంగా మరొకరిని నియమించాలని కార్తీక్ మురళీధరన్ సూచించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు పోషకాహారం అందజేసేందుకు పోషణ సఖి పేరుతో మరొకరిని నియమించేందుకు అవకాశం ఉందని అధికారులు తెలియజేశారు. కార్తీక్ మురళీధరన్ సూచించే అంశాలను కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలోని 29 స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని, కార్తీక్ మురళీధరన్‌తో సమన్వయం చేసుకుని దీనిపై ప్రత్యేక నివేదిక రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, సెర్ప్ సీఈవో దివ్య, డిప్యూటీ సీఎం కార్యదర్శి కృష్ణభాస్కర్, మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓజా, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

# నా మాటలు సీరియస్‌గా తీసుకోండి

## ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్, మార్చి 26 : ఇరాన్‌తో యుద్ధం ముగింపు కోసం ప్రయత్నాలు జరుగుతోన్న వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరికలు చేశారు. చర్చల విషయంలో ఇరాన్ వింతగా ప్రవర్తిస్తోందన్నారు. ఆ దేశం ఒప్పందం కోసం ప్రాధేయపడుతూనే.. బయటకు మాత్రం అంగీకరించడం లేదన్నారు. "వారు ఒక ఒప్పందం కోసం మమ్మల్ని వేడుకుంటున్నారు. ఇరాన్ మిలిటరీ పూర్తిగా నాశనమై, తిరిగి పుంజుకునే అవకాశం లేకుండా పోయినందున అలా వేడుకోవాల్సిందే. అయినప్పటికీ, వారు కేవలం మా ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని చెబుతున్నారు. వారు తప్పు చేస్తున్నారు. మరీ ఆలస్యం కాకముందే వారు సీరియస్‌గా వ్యవహరించడం మంచిది. ఆలస్యమైతే.. వెనక్కి తిరిగి చూసే ప్రసక్తే లేదు. దాని పర్యవసనాలు తీవ్రంగా ఉంటాయి" అని సామాజిక మాధ్యమం ట్రుత్‌లో ట్రంప్ పోస్టు చేశారు.

కొన్నిగంటల ముందు కూడా ట్రంప్ ఇవే వ్యాఖ్యలు చేశారు. రిపబ్లికన్ పార్టీ విరాళాల సేకరణ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. "యుద్ధం ముగింపు విషయంలో చర్చలు జరుపుతున్నాం. ఆ ఒప్పందం కోసం ఇరాన్ ప్రాధేయపడింది. కానీ, ఆ విషయాన్ని వారు బయటకు చెప్పట్లేదు. ఎందుకంటే సొంత ప్రజల చేతుల్లోనే హత్యకు గురవుతారని వారు భయపడుతున్నారు" అని అన్నారు. మరోవైపు ఇరాన్ నుంచి భిన్నమైన స్పందన వచ్చింది. అమెరికా ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని, ఘర్షణల ముగించేందుకు చర్చలు జరిపే ఉద్దేశం లేదని ఆ దేశ విదేశాంగమంత్రి స్పష్టం చేశారు.

**నాటో దేశాలు ఏమీ చేయట్లేదు: ట్రంప్**

ఇరాన్ యుద్ధం విషయంలో నాటో దేశాల (ఔయిా నిజీబితినీనిబ) నుంచి ఎలాంటి మద్దతు లభించకపోవడంపై ట్రంప్ మరోసారి తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. "ఇప్పటికే మిలిటరీ పరంగా తీవ్రంగా నష్టపోయిన ఇరాన్ విషయంలో అమెరికాకు నాటో దేశాలు ఏమాత్రం సహకరించడం లేదు. నాటో నుంచి ఎలాంటి అవసరం లేదు. కానీ, ఇలాంటి ముఖ్యమైన సమయంలో వారు ప్రవర్తించిన తీరును ఎప్పటికీ మర్చిపోం" అని మరో పోస్టు చేశారు.

## హర్మూజ్ సమీపంలో దాడి.. ఇరాన్ నేవీ చీఫ్ మృతి!



టెహ్రాన్, మార్చి 26 : ఇరాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది! 'ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్' (ఐఆర్‌జీసీ) నౌకాదళ చీఫ్ అలీరెజా తంగ్సిరిని మృతి చెందినట్లు ఇజ్రాయెల్ అధికారులను ఉటంకిస్తూ స్థానిక మీడియా తెలిపింది. తీరప్రాంత నగరమైన బందర్ అబ్బాస్‌పై జరిపిన దాడుల్లో ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించింది. హర్మూజ్ జలసంధి మూసివేతను ఆయనే పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొంది. 2018 నుంచి అలీరెజా నేవీ చీఫ్ పదవిలో కొనసాగుతున్నారు. దీనిపై ఇరాన్ ఇంకా ఎటువంటి ప్రకటన చేయలేదు. పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగు తున్నాయి. క్షిపణి శిథిలాలు మీదపడి అబుధాబీలో ఇద్దరు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాల య్యాయి. ఇజ్రాయెల్‌లోని కెఫర్ ఖాసీం ప్రాంతంలో ఐదుగురు, టెల్ అవీవ్‌లో ఇద్దరు గాయపడ్డారు. ఇజ్రాయెల్ సైనిక నియంత్రణ కేంద్రం, అణు మౌలిక సదుపాయాలకు సంబంధించిన పరిశ్రమలపైనా దాడులు చేశామని ఐఆర్‌జీసీ ప్రకటించింది. లెబనాన్‌లో ఓ సైనికుడు మృతి చెందినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. మరోవైపు.. ఇరాన్‌కు తాము డ్రోన్లు సరఫరా చేస్తున్నామనే కథనాలను రష్యా ఖండించింది.

## రష్యా చమురు తీసుకెళ్తున్న నౌకపై నల్లసముద్రంలో దాడి

న్యూఢిల్లీ, మార్చి 26 : నల్లసముద్రంలో రష్యా చమురు రవాణా చేస్తున్న నౌకపై దాడి జరిగింది. గురువారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగిందని తుర్కియే రవాణా శాఖ మంత్రి అబ్దుల్‌ఖాదిర్ వెల్లడించారు. "తుర్కియే కంపెనీ ఆధ్వర్యంలో విదేశీ జెండాతో వెళ్తున్న నౌక అది. అది రష్యా నుంచి ముడి చమురు తీసుకొస్తోంది. దాని ఇంజిన్ రూమ్‌లో పేలుడు సంభవించినట్లు మా ఎమర్జెన్సీ కాల్ సెంటర్‌కు సమాచారం వచ్చింది. ఇంజిన్ రూమ్ లక్ష్యంగా ఆ దాడి జరిగింది. అది డ్రోన్ కాకపోవచ్చు. అన్‌మ్యాన్డ్ సర్ఫేస్ వెహికిల్ (సిబ్బంది లేకుండా నీటి ఉపరితలంపై ప్రయాణించే పడవ లేక నౌక. దీనిని రిమోట్‌గా నియంత్రిస్తారు) కావొచ్చు" అని మంత్రి వెల్లడించారు. బాస్ఫరస్ జలసంధికి 30 కి.మీ.దూరంలో ఈ దాడి జరిగింది.


## భారత్ నౌకలకు హర్మూజ్‌లో అనుమతి

### ప్రకటించిన ఇరాన్



టెహ్రాన్, మార్చి 26 : భారత్ సహా తమ మిత్రులైన ఐదు దేశాల నౌకల కోసం హర్మూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ప్రకటించారు. ఈ విషయాన్ని ముంబయిలోని ఇరాన్ కాన్సు లేట్ జనరల్ కార్యాలయం 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. "మేము హర్మూజ్ నుంచి ప్రయాణించేందుకు మిత్ర దేశాలకు అనుమతులు ఇస్తున్నాం. వీటిలో చైనా, రష్యా, భారత్, ఇరాక్, పాకిస్థాన్ ఉన్నాయి" అని అరాగ్చీ ప్రకటించినట్లు పేర్కొంది. దీంతో హర్మూజ్ జలసంధికి ఇరువైపులా చిక్కుకుపోయిన భారత్ నౌకలు సరకులతో తమ గమ్యస్థానాలు చేరేందుకు మార్గం సులువైంది. ఇప్పటికే ఐదు గ్యాస్ ట్యాంకర్లు హర్మూజ్ వద్ద అనుమతుల కోసం ఎదురుచూస్తున్నట్లు ఇటీవల కథనాలు వెలువడ్డాయి. ఇరాన్ నిర్ణయంతో వీటి ప్రయాణంపైనా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మరిన్ని నౌకలు కూడా భారత్‌లోని గమ్యస్థానాలకు చేరవచ్చు. ఇరాన్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న దౌర్జన్యాలకు మద్దతు ఇవ్వమని తేల్చిచెప్పిన దేశాల నౌకలు మాత్రమే హర్మూజ్‌లో ప్రయాణించవచ్చని ఇప్పటికే ఇరాన్ వెల్లడించిన విషయం తెలిసిందే. మరోవైపు హర్మూజ్‌లో ప్రయాణించే నౌకలపై టోల్ విధించే అంశంపై చట్టం చేసేందుకు ఇరాన్ పార్లమెంట్ పనిచేస్తోందని 'బ్లూమ్‌బెర్గ్' తన కథనంలో పేర్కొంది. ఈ టోల్ విధించినందుకు బదులుగా ఆయా నౌకలకు ఇరాన్ భద్రత కల్పిస్తూ హర్మూజ్‌ను దాటించనున్నట్లు తెలిపింది. ఈమేరకు బ్లూమ్‌బెర్గ్ ఇరాన్ అధికారిక ఫార్స్ న్యూస్ ఏజెన్సీని ఉటంకిస్తూ కథనంలో పేర్కొంది.

## కెనడాలో కీలక చట్టం.. ఖలిస్థానీల ఆగడాలకు చెక్!



కెనడా, మార్చి 26 : విద్వేషపూరిత చర్యలు, నేరాలను అరికట్టేందుకు తీసుకొచ్చిన 'కాంబాటింగ్ హేట్' (సీ9 బిల్లు) బిల్లుకు కెనడా చట్టసభ ఆమోదం తెలిపింది. ఈ కీలక బిల్లుకు హౌస్ ఆఫ్ కామన్స్ ఆమోదముద్ర వేయగా, అనంతరం దీనిని ఎగువసభ (సెనెట్)కు పంపించారు. విద్వేష చిహ్నాలను బహిరంగంగా ప్రదర్శించడాన్ని నేరంగా పరిగణిస్తారు. ఇది అమల్లోకి వస్తే ప్రార్థనా స్థలాలపై దాడులు, ఖలిస్థానీ మద్దతుదారుల ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందని విశ్లేషకుల అంచనా. ఈ చట్టం కోసం కెనడాలోని భారత సంతతి వ్యక్తులు సుదీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్నారు. కెనడాలో ఖలిస్థానీల ఆగడాలు ఇటీవల పెరిగిపోయాయి. కొన్ని వర్గాల వారిని లక్ష్యంగా చేసుకుంటూ బెదిరింపులకు పాల్పడుతుండటం, విధ్వంసం సృష్టించడం.. తదితర ఘటనలు పెరుగుతున్నాయి. ఈ తరహా ఘటనలపై ప్రవాస భారతీయులు ఎన్నో ఏళ్లుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి తరుణంలోనే విద్వేష చర్యలకు సంబంధించి కొత్త బిల్లు ఆమోదం పొందడం ఊరట కలిగించే విషయం. నిషేధిత సంస్థల చిహ్నాలను బహిరంగంగా ప్రదర్శించడం, కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకొని విద్వేషాన్ని రెచ్చగొట్టడం వంటి చర్యలను కొత్త బిల్లు ప్రకారం తీవ్ర నేరంగా పరిగణిస్తారు. యూదులు, ముస్లింలు, ఇతర మతాల వారిని ఆయా ప్రార్థనా స్థలాల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడం కూడా నేరమే. ఇటువంటి చర్యలకు పాల్పడేవారికి గరిష్ఠంగా పదేళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉంది. అయితే, కన్జర్వేటివ్‌లు మాత్రం ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నారు.

## అమరావతికి చట్టబద్ధత కల్పించేలా ఏపీ క్యాబినెట్ తీర్మానం



అమరావతి, మార్చి 26 (పోలీస్ నిఘా) : ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన ఏపీ క్యాబినెట్ భేటీ జరిగింది. రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ.. ఏపీ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్-5ను సవరించాల్సిందిగా మంత్రివర్గం తీర్మానం చేసింది. కొత్త రాజధాని స్థానంలో అమరావతి పేరును చేర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాకుండా నీరుకొండలో ఎస్ఆర్ఎం వర్సిటీ, 60 మీటర్ల ఎత్తు వరకు అకడమిక్ భవనాల నిర్మాణానికి క్యాబినెట్ అనుమతి ఇచ్చింది.

**క్యాబినెట్ మరిన్ని నిర్ణయాలు...**

రాష్ట్రంలో 96 జూనియర్, సీనియర్ సివిల్ జడ్జిల కోర్టుల ఏర్పాటుకు ఆమోదం. వడ్డెర సంఘాలకు ప్రాధాన్యక్రమంలో ఖనిజ లీజుల కేటాయింపులపై చర్చ. ఖనిజ లీజుల కేటాయింపులో ప్రీమియం, సీనరేజ్ ఫీజుల్లో 50శాతం రాయితీ. కుప్పం బాలికల పాఠశాలలో పీఈటీ, నర్సు, రికార్డు అసిస్టెంట్ పోస్టుల మంజూరుకు ఆమోదం. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ. జలవనరుల శాఖలో వివిధ ప్రాజెక్టుల ఆధునికీకరణ, మరమ్మతులకు పరిపాలన అనుమతులు. వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై నిర్ణయం తీసుకున్న రాష్ట్ర మంత్రివర్గం. ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని మంత్రి వర్గం నిర్ణయించింది. కొత్త రాజధానిగా సీఆర్డీఏ చట్టం పరిధిలోని అమరావతి పేరు చేర్చాలని క్యాబినెట్ తీర్మానించింది. ఎల్లుండి అసెంబ్లీలో 4 గంటలపాటు చర్చించి తీర్మానించాలని నిర్ణయించింది. రాజధాని చరిత్రను ప్రజలకు తెలియ జేయాలని సీఎం చంద్రబాబు క్యాబినెట్‌కు సూచించారు. క్యాబినెట్ సమావేశంలో భాగంగా విద్యుత్ వ్యవస్థపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏప్రిల్ 5 నుంచి 14 లోపు ప్రతి నియోజకవర్గంలో 2 వేల చొప్పున సూర్యఘర్ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించారు. పీఎం కుసుమ్ ద్వారా పవర్ లాస్‌లు తగ్గించేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థల్ని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ల వద్ద ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సాంకేతికత అందిపుచ్చుకుంటూ సంస్కరణలు తీసుకొస్తూ విద్యుత్‌శాఖ ముందుకెళ్లాలని సూచించారు.

" ఆదాయంలో 99శాతం జీతాలకే సరిపోతోంది. కేంద్ర సాయం అప్పులు, వడ్డీలు కట్టేందుకే సరిపోతోంది. క్లిష్టపరిస్థితుల్లోనూ సంక్షేమం అందిస్తూ అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం. కేంద్ర పథకాలను ఎక్కువగా మనం ఉపయోగించుకుంటున్నాం. ఈ పార్లమెంట్ భేటీలోనే రాజధానిగా అమరావతి చట్టబద్ధత సవరణ బిల్లు పెడతారు" అని సీఎం చంద్రబాబు అన్నారు.

## ఆరోగ్యశ్రీలో విప్లవాత్మక మార్పులు

### 9.45 లక్షల మందికి ఉచిత వైద్యం
### అసెంబ్లీలో మంత్రి దామోదర రాజనర్సింహ



హైదరాబాద్, మార్చి 26 (పోలీస్ నిఘా) : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు 9 లక్షల 45 వేల మందికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు అందించినట్లు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. గురువారం అసెంబ్లీలో క్వశ్చన్ అవర్ సందర్భంగా ఆరోగ్యశ్రీ బకాయిలు, సేవలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన వివరణాత్మక సమాధానం ఇచ్చారు. గతంలో ఏడాదికి సగటున 2.5 లక్షల మందికి మాత్రమే సేవలు అందగా, ప్రస్తుతం ఆ సంఖ్య 4 లక్షలకు చేరిందని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లింపులను భారీగా పెంచిందని, గత ప్రభుత్వ హయాంలో నెలకు సగటున రూ. 52 కోట్లు చెల్లిస్తే, ప్రస్తుతం నెలకు రూ. 89 కోట్లు రెగ్యులర్‌గా చెల్లిస్తున్నామని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వం నుంచి వచ్చిన రూ. 600 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు, రూ. 130 కోట్ల ఈహెచ్‌ఎస్ బకాయిలను కూడా క్రమంగా తగ్గిస్తూ వస్తున్నామని మంత్రి తెలిపారు. 2023 డిసెంబర్ 8 నుంచి ఇప్పటివరకు సుమారు రూ. 2400 కోట్లకు పైగా పేమెంట్స్ చేశామని, ప్రస్తుతం ప్రైవేట్ ఆస్పత్రులకు కేవలం రూ. 250 కోట్ల బకాయిలు మాత్రమే ఉన్నాయని వివరించారు. ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ సేవలకు నిరాకరిస్తున్నాయన్న ప్రతిపక్షాల ఆరోపణలను ఆయన ఖండించారు. తాము అధికారంలోకి వచ్చే నాటికి 330గా ఉన్న నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్య ఇప్పుడు 537కు పెరగడమే తమ పనితీరుకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ములుగు, నారాయణపేట వంటి మారుమూల జిల్లాల్లోనూ ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు.


## రాష్ట్రానికి రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు

### దావోస్ పర్యటనపై సభలో మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, మార్చి 26 (పోలీస్ నిఘా) : 2024, 2025 దావోస్ పర్యటనల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగా రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులను సముపార్జించిందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. సభలో దావోస్ పర్యటనలో భాగంగా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులపై బీజేపీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. మొత్తం 44 ఎంవోయూలను వివిధ కంపెనీలతో కుదుర్చుకున్నామని పేర్కొన్నారు. ఆయా పెట్టుబడుల గ్రౌండింగ్ వివిధ దశల్లో ఉన్నాయని, ఫలితంగా కొత్తగా 68,150 మంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా ఉపాధి లభించనుందని తెలిపారు. 2024లో 18 ఎంవోయూలతో రాష్ట్రానికి రూ. 40,232 కోట్ల పెట్టుబడులు రాగా, 2025లో 26 ఎంవోయూలతో రూ.1,78,950 కోట్లు కలుపుకుని మొత్తం 44 ఎంవోయూలతో రూ.2,19,182 కోట్ల పెట్టుబడులు వచ్చాయని అన్నారు. అయితే, దావోస్ పర్యటనల్లో భాగంగా రూ.81,800 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఎంవోయూలు కుదుర్చుకున్న 6 కంపెనీలకు ఇప్పటికే భూములు కేటాయించామని చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రభుత్వానికి రూ.1,540 కోట్ల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. ఇక నిజామాబాద్ ఐటీ టవర్ మొత్తం 681 సీట్ల సామర్థ్యం ఉందని, ప్రస్తుతం అక్కడ 11 కంపెనీలు 276 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని మంత్రి శ్రీధర్ బాబు సభలో ప్రస్తావించారు.

## ఎంఎంటీఎస్ సమయ పాలన పాటించాలి: సీఎం రేవంత్




హైదరాబాద్, మార్చి 26 (పోలీస్ నిఘా): హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ప్రయాణికుల అవసరాల్కు అనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసులు ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఎంఎంటీఎస్‌లో ఏటికేడు ప్రయాణికుల తగ్గుముఖంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఎంఎంటీఎస్ సర్వీసులపై శాసనమండలి హాల్‌లో ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. కార్యాలయాల సమయాల్లో ఎంఎంటీఎస్‌ల సంఖ్య పెంచడంతోపాటు క్రమంతప్పకుండా సమయ పాలన పాటిస్తూ సర్వీసులు నడపాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్ల వద్దకు ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు అవకాశం లేకపోవడం, స్టేషన్లు లోపలికి ఉన్నందున అక్కడకు రాకపోకలు సాగించేందుకు వీలుగా మినీ బస్సులు నడిపే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని, మెరుగైన వసతులు ఉన్నప్పుడే ప్రయాణికులు ఎంఎంటీఎస్ వైపు మొగ్గు చూపుతారని తెలిపారు. స్వీయ ఆదాయ వనరులు పెంచుకునేందుకు ప్రయత్నించాలని అధికారులకు సీఎం సూచించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంపుతోపాటు ప్రయాణికుల సంఖ్య పెంపు, వసతులు మెరుగుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమీక్షలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఎంఏయూడీ స్పెషల్ సెక్రటరీ జయేష్ రంజన్, ఆర్ అండ్ బీ వికాస్ రాజ్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హెచ్‌యూఎంటీఏ ఎండీ జీవన్‌బాబు, దక్షిణ మధ్య రైల్వే డీసీఎం చరణ్ నాయక్ పాల్గొన్నారు.

## తెలంగాణలో పెట్రోల్, ఎల్పీజీ కొరత లేదు: స్టీఫెన్ రవీంద్ర



హైదరాబాద్, మార్చి 26 (పోలీస్ నిఘా) : తెలంగాణలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత లేదని పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. పెట్రోల్ బంకుల వద్ద రద్దీ నేపథ్యంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఇంధన నిల్వలపై ఈ మేరకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. సోషల్ మీడియాలో వదంతులు చూసి ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు.

## 'వందేభారత్' భోజనంలో పురుగులు: ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షల జరిమానా





న్యూఢిల్లీ, మార్చి 26 : వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో అందించిన ఆహారంలో పురుగులు కన్పించడం తీవ్ర వివాదాస్పదమైంది. తమకు ఇచ్చిన భోజనంలో పురుగులు ఉన్నాయంటూ రితేష్‌కుమార్ అనే ప్రయాణికుడు ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహం వ్యక్తంచేసిన రైల్వేశాఖ.. ఐఆర్‌సీటీసీకి జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే.. రితేశ్‌కుమార్ మార్చి 15న పట్నా-టాటానగర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించారు. ఆ సమయంలో తమకు అందించిన భోజనంలోని పెరుగులో పురుగులు రావడంతో ఆయన కంగుతిన్నారు. వెంటనే మేనేజర్‌ని పిలిచి ఫిర్యాదు చేశారు. రైలు సిబ్బంది ఆ భోజనాన్ని పరిశీలించారు. ఇదంతా రితేశ్ వీడియో తీసి సోషల్ మీ డియాలో పోస్ట్ చేశారు. ఇదికాస్తా వివాదాస్పదం కావడంతో రైల్వే మంత్రిత్వశాఖ ఎక్స్‌లో స్పందించింది. ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షల జరిమానా విధిస్తున్నట్లు వెల్లడించింది. ఆ రైల్లో కేటరింగ్ చేసిన ఫుడ్ సర్వీస్ ప్రొవైడర్‌కు రూ.50 లక్షల జరిమానాతో పాటు అతడి కాంట్రాక్టును రద్దు చేసినట్లు తెలిపింది. ప్రయాణికుల భద్రత, రైల్వే సౌకర్యాల్లో నాణ్యతే తమ ప్రథమ ప్రాధాన్యమని రైల్వేశాఖ వివరించింది.

Printed, Published & Owned by Kemoju Madhuri, Plot No.32, 3rd Floor, R.K.Nagar, Attapur, Rajendra Nagar, R.R.Dist., Telangana State, Pin Code:500043, Printed at S.V.Printers, Plot No.32,Ground Floor, R.K.Nagar, Attapur, Rajendra Nagar, R.R.Dist., Telangana State, Pin Code: 500043, Editor : Kemoju Srinivas, RNI No.TELTEL/2016/68720, e-mail: policenigah@gmail.com. Cell: 9133613813, Off: 040-35668279